ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5



తమిళనాడు

TAMILNADU

గురువారం 9 అక్టోబరు 2025

నాగమలై కొండ



జీవవైవిధ్య వారసత్వ ప్రదేశం 'నాగమలై'

● ప్రభుత్వ ప్రకటన


చెన్నై, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): జీవవైవిధ్య వారసత్వ ప్రదేశంగా ఈరోడ్ జిల్లాలోని నాగమలై కొండను రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. దీనితో రాష్ట్రంలో జీవవైవిధ్య వారసత్వ ప్రదేశాల సంఖ్య నాలుగుకు పెరిగింది. ఈ మేరకు రాష్ట్ర పర్యావరణ, అటవీ శాఖ బుధవారం ప్రకటన జారీ చేసింది. జీవవైవిధ్య చట్టం 2002 సెక్షన్ 37(1) ప్రకారం అరిడాపట్టిని 2022 నవంబర్‌లో జీవవైవిధ్య వారసత్వ ప్రాంతంగా ప్రకటించింది. 2024 మార్చిలో కాచంపట్టిని, అదే యేడాది సెప్టెంబర్‌లో ఏలత్తూరు చెరువును జీవవైవిధ్య వారసత్వ ప్రదేశాలుగా ప్రకటించింది. ఈ క్రమంలో ఈరోడ్ జిల్లాలో 32.22 హెక్టార్ల విస్తీర్ణం కలిగిన నాగమలై కొండను నాలుగో జీవవైవిధ్య వారసత్వ ప్రాంతంగా ప్రకటించింది. అంతరించిపోయే దశలో ఉన్న అరుదైన జంతువులను, పశుపక్ష్యాదులను సంరక్షించడం కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక పరిరక్షణ నిధిని ఏర్పాటు చేసింది. నాగమలై కొండను నాలుగో జీవవైవిధ్య వారసత్వ ప్రదేశంగా ప్రకటించడం రాష్ట్ర జీవవైవిధ్య పరిరక్షణ ప్రయాణంలో మరో మైలు రాయి అని పర్యావరణ ప్రేమికులు చెబుతున్నారు.

నాగమలైలో ఏముంది?.. : నాగమలై కొండ అరుదైన 138 వృక్షజాతులు, 118 పక్షి జాతులు, 7 రకాల క్షీరదాలు, 11 రకాల సరీసృపాలకు నిలయంగా ఉంటోంది. ఇనుప యుగం నాటి ఆనవాళ్లు, గుహలు, రాతియుగం నాటి ఆయుధాలు, గుహలు మెండుగా ఉన్నాయి. ఈ ప్రాంతాన్ని సంరక్షించేందుకు ప్రభుత్వం అన్ని చర్యలు చేపడుతుందని అటవీశాఖ ఉన్నతాధికారులు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం నాగమలై కొండను పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దుతుందని, అదే సమయంలో ఆ కొండపై స్థావరాలు ఏర్పరచుకున్న జంతుజాలాలకు ఎలాంటి ముప్పువాటిల్లకుండా వాటి సంతతిని పెంచేందుకు చర్యలు తీసుకుంటుందని వివరించారు.

తైలాపురం గార్డెన్‌లో రాందాస్

సందర్శకులకు 3 రోజులు అనుమతి లేదు

చెన్నై, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): పాట్టాలి మక్కల్ కట్చి వ్యవస్థాపకుడు డాక్టర్ రాందాస్‌ను నేరుగా కలుసుకోవడానికి దిండివనంలోని తైలాపురం గార్డెన్ నివాసానికి ఎవరూ రాకూడదని ఆ పార్టీ వర్గాలు ప్రకటించాయి. ఇటీవల రాందాస్ అస్వస్థతకు గురై అపోలో ఆస్పత్రిలో చికిత్సలందుకున్నారు. మంగళవారం సాయంత్రం ఆయన డిశ్చార్జి అయ్యి తైలాపురం గార్డెన్‌కు చేరుకున్నారు. ఈనెల 12 వరకు ఇంటిపట్టునే విశ్రాంతి తీసుకోవాలని అపోలో ఆస్పత్రి వైద్యుల సలహాను రాందాస్ పాటించాలని నిర్ణయం తీసుకున్నారు. ఈ మేరకు తనను నేరుగా కలుసుకునేందుకు పార్టీ ప్రముఖులు, నేతలు, కార్యకర్తలు రాకూడదని ప్రకటించారు. ఈనెల 13న సోమవారం ఉదయం 10 గంటల నుంచి రాందాస్‌ను ఎప్పటివలెనే తైలాపురం గార్డెన్‌లో కలుసుకోవచ్చునని పార్టీకి చెందిన ఎమ్మెల్యే జీకేమణి తెలిపారు.



మెరీనాకు ఏఐ నిఘా

● ముఖం, వాహనాల నెంబర్లు గుర్తించేందుకు 300 కెమెరాలు

పెరంబూర్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): స్థానిక మెరీనా బీచ్‌లో కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటు చేసేందుకు నగర పోలీసుశాఖ చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) పరిజ్ఞానంతో 300 అధునాతన కెమెరాలు ఏర్పాటుచేయనుంది. ఈ ఏర్పాటుతో చోరీలకు అడ్డుకట్ట వేయడంతో పాటు, మెరీనాను రక్షణ మండలంగా మార్చాలని పోలీసుశాఖ నిర్ణయించింది.ఇందుకోసం అత్యాధునిక కెమెరాల కొనుగోలుకు నగర పోలీసుశాఖ టెండర్లు ఆహ్వానించింది. కార్మిక స్మారక స్థూపం నుంచి శ్రీనివాసపురం వరకు ఐదు మండలాలుగా విభజించి, కన్నగి విగ్రహం, లైట్ హౌస్, నేపియర్ వంతెన, శాంథోమ్ చర్చి, కామరాజర్ రోడ్డు పరిధిలోని 71 ప్రధాన ప్రాంతాల్లో ఈ కెమెరాలను ఏర్పాటు చేయనున్నారు. అవసరమైన వారి ముఖం స్పష్టంగా గుర్తించడం, వాహనాల నెంబర్ల నమోదు తదితర సాంకేతిక పరిజ్ఞానంతో ఈ కెమెరాలు పనిచేయనున్నాయి. ఈ కెమెరాలను అన్నా స్క్వేర్ పోలీస్ స్టేషన్ లోని కంట్రోల్ రూం నుంచి ఆపరేట్ చేయనున్నారు. అనంతరం ఈ దృశ్యాలను కొద్దిక్షణాల్లోనే వెప్పేరిలోని కంట్రోల్ రూంకు పంపిస్తారు. రద్దీ సమయాలు, అనుమానాస్పద వ్యక్తులను గుర్తించి, కంట్రోల్ రూం ద్వారా సత్వరం ఆ ప్రాంతంలో విధులు నిర్వహిస్తున్న పోలీసులకు ఉత్తర్వులు జారీ చేయవచ్చు. సీసీ ఫుటేజీ 30 రోజులు భద్రపరిచే సామర్థ్యం కలిగి ఉండేలా చర్యలు తీసుకుంటున్నట్టు అధికారులు తెలిపారు.

హత్య కేసులో ఐదుగురికి యావజ్జీవం

● తిరునల్వేలి న్యాయస్థానం సంచలన తీర్పు



శంకర్, అరుణాచలం, మురుగన్, లక్ష్మణన్, రాజేష్

పెరంబూర్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ యూనియన్ మాజీ అధ్యక్షురాలి భర్త హత్య కేసులో తిరునల్వేలి కోర్టు సంచలన తీర్పు వెలువరించింది. ఐదుగురిని దోషులుగా తేల్చిన న్యాయస్థానం.. వారికి యావజ్జీవ కారాగార శిక్ష విధిస్తున్నట్లు ప్రకటించింది. కూనియూర్‌కు చెందిన రైతు అరుణాచలం అలియాస్ కుమారపాండ్యన్ (48) తన బంధువుకు సొంతమైన కల్యాణ మండపాన్ని నిర్వహించేవారు. ఆయన భార్య గీత 2013లో చేరన్మహాదేవి పంచాయతీ యూనియన్ అధ్యక్షురాలిగా బాధ్యతలు నిర్వర్తించారు. 2013 అక్టోబరు 22వ తేది రాత్రి కుమారపాండ్యన్ బైక్‌పై ఇంటికి వెళుతుండగా, గుర్తుతెలియని వ్యక్తులు మారణాయుధాలతో దాడిచేసి పరారయ్యారు. ఈ ఘటనలో ఆయన అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటనపై చేరన్మహాదేవి పోలీసులు కేసు నమోదు చేసి చేపట్టిన విచారణలో.. 2013 జూలై 22న జరిగిన కూనియూర్ సుబ్రమణియన్ హత్యకు ప్రతీకారంగా కుమారపాండ్యన్ హత్యకు గురయ్యాడని గుర్తించారు. ఈ కేసుకు సంబంధించి కూనియూర్‌కు చెందిన ఆర్ముగనయినార్, ఆర్ముగదాస్, శంకర్ అలియాస్ పార్వతి శంకర్, అరుణాచలం, మురుగన్, కోవిల్‌పట్టి లక్ష్మణన్, శంకరన్‌కోయిల్ వడుకనూర్ రాజేష్ అలియాస్ రాజేష్ కన్నన్ సహా 19 మందిని పోలీసులు అరెస్ట్ చేశారు. తిరునల్వేలి జిల్లా ప్రిన్సిపల్ సెషన్స్ కోర్టులో ఈ కేసు విచారణ జరిగింది. విచారణ సమయంలో, ఆర్ముగ నయినార్, ఆర్ముగదాస్, ఉలగనాథన్ మృతిచెందగా, మిగిలిన 16 మందిపై విచారణ సాగింది. ఈ కేసు విచారణ పూర్తికావడంతో న్యాయమూర్తి సెల్వం బుధవారం తీర్పు వెలువరించారు.ఈ కేసులో నేరారోపణలు ఎదుర్కొంటున్న శంకర్, అరుణాచలం, మురుగన్, లక్ష్మణన్, రాజేష్‌కు యావజ్జీవ జైలుశిక్ష విధిస్తున్నట్లు ప్రకటించారు. అదే విధంగా శంకర్, అరుణాచలంకు తలా రూ.10 వేలు, రాజేష్, లక్ష్మణన్‌లకు తలా రూ.12,500 జరిమానా విధించారు. అలాగే, నేరారోపణలు నిరూపితం కాకపోవడంతో మిగిలిన 11 మందిని నిర్దోషులుగా ప్రకటించారు.



గాజాపై దాడులను అడ్డుకోవాలంటూ ప్లకార్డులతో సీఎం స్టాలిన్, కూటమి పార్టీల నేతలు

గాజాపై దాడులు అమానుషం

● ఖండిస్తూ అసెంబ్లీలో తీర్మానం చేస్తామన్న సీఎం స్టాలిన్

పెరంబూర్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): గాజాపై ఇజ్రాయెల్ చేస్తున్న అమానుష దాడులను సత్వరం ఆపేలా చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ డిమాండ్ చేశారు. గాజాపై ఇజ్రాయెల్ చేస్తున్న దాడులను ఖండిస్తూ వచ్చే శాసనసభ సమావేశాల్లో తీర్మానం చేస్తామని కూడా ప్రకటించారు. స్థానిక ఎగ్మూర్‌లో సీపీఎం ఆధ్వర్యంలో బుధవారం గాజాపై ఇజ్రాయెల్ దాడులను నిరసిస్తూ సభ నిర్వహించారు. ఈ సభకు ముఖ్య అతిథిగా హాజరైన సీఎం... ఇజ్రాయెల్ దాడులకు వ్యతిరేకంగా ప్లకార్డులు చేతబట్టి నినదించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... గాజాపై ఇజ్రాయెల్ అమానుష దాడులు అందరినీ ఆవేదనకు గురిచేస్తున్నాయన్నారు. పలు సంవత్సరాలుగా పాలస్తీనాపై దాడులు చేస్తోందన్నారు. ఆ దాడుల్లో ఇప్పటివరకు 11 వేలమంది మహిళలు, 17 వేలమంది పిల్లలు, 175 మంది జర్నలిస్టులు, 125 మంది యూఎన్ సిబ్బంది, 50 వేల మందికి పైగా ప్రజలు మృతిచెందారని తెలిపారు. 26 వేల మంది పిల్లలు తమ తల్లిదండ్రులను కోల్పోగా, సుమారు లక్ష మంది వరకు గాయాలతో ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారన్నారు. గాజాలోని అధిక భాగం ఏడాది కాలంలోనే ధ్వంసం చేశారన్నారు. అయినా, ఇజ్రాయెల్ దురాగతాలకు వ్యతిరేకంగా పాలస్తీనా ప్రజలు వీరోచితంగా పోరాడుతున్నారన్నారు. గత జూన్‌లో ఆహారం తీసుకెళ్తున్న ట్రక్కు కోసం ఆకలితో ఎదురుచూస్తున్న 45 మంది పాలస్తీనియన్లను ఇజ్రాయెల్ దళాలు కాల్చి చంపాయన్నారు. ఆహారం కోసం ఎదురుచూస్తున్న వారి ప్రాణాలు బలిగొనే ఈ క్రూరమైన చర్య అందరి హృదయాలను ద్రవింపజేసిందన్నారు. అలాగే, గాజాలో మృత్యువుతో పోరాడుతున్న పాలస్తీనా ప్రజలకు ఆహారం, మందులు, బేబీ మిల్క్ పౌడర్ తీసుకెళ్తున్న 47 దేశాలకు చెందిన స్వచ్ఛంద సేవకులను ఇజ్రాయెల్ అరెస్ట్ చేయడాన్ని ఖండిస్తున్నామన్నారు. ఈ దాడులు ఆపేలా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఒత్తిడి తీసుకురావాలని, గాజాలో శాంతి నెలకొల్పడానికి, మానవతా సహాయం అందించేలా ఐకరాజ్య సమితి, ఇతర అంతర్జాతీయ సంస్థలతో కలసి పనిచేయాలని విజ్ఞప్తి చేశారు. ఈనెల 14 నుంచి ప్రారంభం కానున్న శాసనసభ సమావేశాల్లో, గాజాపై ఇజ్రాయెల్ దాడిని ఖండిస్తూ, అక్కడ తక్షణ కాల్పుల విరమణ అవసరాన్ని నొక్కి చెబుతూ, కేంద్ర ప్రభుత్వం ఆ దిశగా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తూ తీర్మానం తీసుకురానున్నామని ముఖ్యమంత్రి స్టాలిన్ ప్రకటించారు. సభకు సీపీఎం రాష్ట్ర కార్యదర్శి షణ్ముగం అధ్యక్షత వహించగా, ఆ పార్టీ మాజీ రాష్ట్ర కార్యదర్శి కె.బాలకృష్ణన్, కేంద్ర కమిటీ సభ్యులు వాసుకి, ద్రవిడ కళగం అధ్యక్షుడు వీరమణి, టీఎన్‌సీసీ అధ్యక్షుడు సెల్వపెరుందగై, వీసీకే అధ్యక్షుడు తిరుమావళవన్, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి ఎం.వీరపాండియన్, కూటమి పార్టీల నేతలు పాల్గొని, ఇజ్రాయెల్ దాడులు ఖండిస్తూ ప్లకార్డులు చేతబట్టి నినాదాలు చేశారు.



ధర్నాలో పాల్గొన్న నిరసనకారులు

నాలుగేళ్లుగా గవర్నర్‌తో ప్రభుత్వ పోరాటం

● ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి



చెన్నై, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): నాలుగేళ్లుగా గవర్నర్‌తో రాష్ట్ర ప్రభుత్వం పోరాడుతూనే ఉందని ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి పేర్కొన్నారు. బుధవారం జరిగిన తిరుచ్చి శ్రీరంగం శాసనసభ నియోజకవర్గ పార్టీ సమావేశంలో పాల్గొన్న ఉదయనిధి మాట్లాడుతూ.. రాష్ట్రంలో అన్ని పార్టీలు ఎన్నికల ప్రచారం ప్రారంభించాయన్నారు. అయితే ఒక్కరు మాత్రం రెండు రోజుల క్రితం ప్రచారం చేపట్టారని, ఆయన మరెవరో కాదు, రాష్ట్ర గవర్నర్ ఆర్ఎన్ రవి అని అన్నారు. 'తమిళనాడు పోరాడుం, తమిళనాడు వెల్లుం' అని మనం చెబుతుంటే, 'నీంగళ్ యారుడన్ పోరాడ పోగిరీర్‌గళ్? యారై వెల్ల పోగీర్‌గళ్?' అంటూ గవర్నర్ ప్రశ్నిస్తున్నారన్నారు. నాలుగేళ్లుగా రాష్ట్ర ప్రభుత్వం గవర్నర్‌తో పోరాడుతూనే ఉందని, తప్పకుండా తమిళనాడు పోరాడి గెలుస్తుందన్నారు. ఎడప్పాడి పళనిస్వామి లాగే ముఖ్యమంత్రి కూడా అణగిమణిగి ఉంటారని గవర్నర్ భావిస్తున్నారని, అయితే ఆ ఆశలు నెరవేరబోవన్నారు. రాష్ట్రంలో డీఎంకే ఉన్నంత వరకు అన్యాయానికి వ్యతిరేకంగా పోరాడతుందిని, ఫాసిస్ట్ శక్తులను ఎన్నడూ అనుమతించే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు.రానున్న ఎన్నికల్లో 200సీట్లు గెలుపే లక్ష్యంగా పార్టీ నేతలు, కార్యకర్తలు కృషిచేయాలని ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి పిలుపునిచ్చారు.

సీమాన్ - విజయలక్ష్మి వివాదానికి సుప్రీం ముక్తాయింపు

● ఇద్దరూ పరస్పరం క్షమాపణలు చెప్పడంతో సంతృప్తి



సీమాన్, విజయలక్ష్మి

చెన్నై,అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): నటి విజయలక్ష్మి, నామ్ తమిళర్ కట్చి నేత సీమాన్ మధ్య 14 యేళ్లుగా సాగుతున్న వివాదాలకు సుప్రీంకోర్టు ఫుల్‌స్టాప్ పెట్టింది. తనను పెళ్లి చేసుకుంటానని మాయమాటలు చెప్పి సీమాన్ మోసగించాడంటూ విజయలక్ష్మి చేసిన ఆరోపణల కేసు పలు మలుపులు తిరిగింది. తనపై ఆరోపణలు చేసిన విజయలక్ష్మిని కించపరిచేలా సీమాన్ కూడా పలుమార్లు విమర్శలు, ఆరోపణలు చేస్తూ వచ్చారు. ఓ దశలో విజయలక్ష్మి సీమాన్‌పై కేసును వెనక్కు తీసుకుంటున్నట్టు ప్రకటించారు. అదే సమయంలో వివాదం హైకోర్టు వరకు వెళ్లడంతో పోలీసులు సీమాన్‌పై లైంగిక వేధింపుల కేసు నమోదు చేశారు. హైకోర్టు ఇరువురూ పరస్పరం ఆరోపణలు మానుకోవాలని సూచించింది. విజయలక్ష్మి కేసును ఉపసంహరించుకున్నా పోలీసులు నమోదు చేసిన లైంగిక వేధింపుల కేసు దర్యాప్తు కొనసాగుతుందని పేర్కొంది. ఈ అంశాన్ని సవాలు చేస్తూ సీమాన్ సుప్రీంకోర్టుకు అప్పీలుకు వెళ్లారు. ఆ అప్పీలు పిటిషన్‌పై విచారణ జరిపిన సుప్రీంకోర్టు నటి విజయలక్ష్మిపై సీమాన్ బహిరంగ ప్రాంతాల్లో చేసిన ఆరోపణలపై ఆగ్రహం వ్యక్తం చేసింది. విజయలక్ష్మికి బేషరతుగా క్షమాపణలు తెలపాలని సీమాన్‌ను ఆదేశించింది. ఈ నేపథ్యంలో బుధవారం సుప్రీంకోర్టులో ఈ పిటిషన్ విచారణకు రాగా సీమాన్ తరపు న్యాయవాది ఓ ప్రమాణ పత్రం సమర్పించారు. అందులో నటి విజయలక్ష్మికి బేషరతుగా క్షమాపణలు తెలుపుకుంటున్నానని, ఆమెపై వెల్లడించిన అభిప్రాయాలను, ఆరోపణలను వెనక్కు తీసుకుంటున్నానని పేర్కొన్నారు. నటి విజయలక్ష్మి కూడా ఇదే రీతిలో సీమాన్‌కు క్షమాపణలు తెలుపుతూ ప్రమాణ పత్రం సమర్పించారు. అందులో సీమాన్ తనకు బేషరతుగా క్షమాపణలు తెలపడంతో ఆయనపై కేసును విత్‌డ్రా చేసుకోవడానికి సిద్ధంగా ఉన్నట్లు ప్రకటించారు. అదే సమయంలో సీమాన్, ఆయన అనుచరుల వల్ల మానసికంగా, ఆర్థికంగా బాగా చితికి పోయానని, నష్టపరిహారం చెల్లించేలా ఉత్తర్వులు ఇవ్వాలని పేర్కొంది. ఈ అంశం పిటిషన్ పరిధిలోకి రాదంటూ సుప్రీంకోర్టు విచారణకు ముగింపు పలికింది.

విజయ్ కరూర్ పర్యటనకు భద్రత కల్పించండి

● డీజీపీకి న్యాయవాదుల వినతి

చెన్నై, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): కరూర్ రోడ్‌షోలో ప్రాణాలు కోల్పోయిన 41 మంది కుటుంబీకులను పరామర్శించేందుకు తమిళగ వెట్రి కళగం (టీవీకే) అధినేత విజయ్ తగు సన్నాహాలు చేపడుతున్నారు. ఆ దిశగా ఆయన తరఫు న్యాయవాదులు తీవ్ర ప్రయత్నాలు సాగిస్తున్నారు. గత సెప్టెంబరు 27 రాత్రి కరూర్ వేలుచ్చామిపురం వద్ద విజయ్ రోడ్‌షోలో పాల్గొన్నప్పుడు తొక్కిలాట జరిగి చిన్నారులు, మహిళలు సహా 41 మంది దుర్మరణం చెందగా, వందమందికి పైగా గాయపడిన విషయం తెలిసిందే. తొక్కిలాట అధికం కావటంతో తన ప్రసంగాన్ని క్లుప్తంగా ముగించి విజయ్ కరూర్ నుంచి ఆగమేఘాలపై చెన్నైకి తిరిగి వెళ్లారు. మార్గమధ్యంలో ఆయన తిరుచ్చి విమానాశ్రయం చేరుకున్న సమయానికి తొక్కిసలాటలో 30 మందికి పైగా ప్రాణాలు కోల్పోయినట్లు వార్తలు వెలువడ్డాయి. ఆ విషయమై విలేఖరుల ప్రశ్నించినప్పుడు విజయ్ బదులు చెప్పకుండా విమానం ఎక్కి వెళ్ళిపోయారు. పయనూరు నివాసగృహంలో రోజంతా గడిపిన తర్వాత విజయ్ తన బసను నీలాంగరైలో ఉన్న మరో బంగ్లాకు మార్చారు. అదే సమయంలో కరూర్ దుర్ఘటన జరిగి మూడు రోజులైన తర్వాత ఓ వీడియో సందేశం వెలువరించారు. మృతుల కుటుంబాలకు తలా రూ.20లక్షల ఆర్థికసాయం ప్రకటించారు. ఈ నేపథ్యంలో విజయ్ కరూర్ వెళ్ళి మృతుల కుటుంబీకులను, గాయపడిన వ్యక్తుల కుటుంబాలను పరామర్శించాలని నిర్ణయించారు. ఆ దిశగా మంగళవారం సాయంత్రం విజయ్ కరూర్ పర్యటనకు భద్రత కల్పించాలంటూ ఈమెయిల్ ద్వారా సందేశం పంపారు. బుధవారం ఉదయం టీవీకే నేత విజయ్ తరఫు న్యాయవాది అరివళగన్ సహా పలువురు న్యాయవాదులు డీజీపీ కార్యాలయానికి వెళ్ళి వినతి పత్రం సమర్పించారు. ఆ వినతి పత్రంలో విజయ కరూర్‌లో పర్యటించనున్న తేదీల వివరాలు కూడా ఉన్నాయని సమాచారం. వినతి పత్రం సమర్పించి తిరిగి వెళుతున్న న్యాయవాది అరివళగన్‌ను విలేకరులు చుట్టుముట్టి విజయ్ ఏ తేదీన కరూర్‌కు వెళతారని ప్రశ్నించగా.. సమాధానం దాటవేశారు.

తిరుచెందూర్‌లో వెనక్కి వెళ్లిన సముద్రం

● నీటమునిగి భక్తుడి మృతి

- వివరాలు 6లో -

సమాచార దర్శిని

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

పెరంబూర్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ లైన్లలో చేపట్టనున్న మరమ్మతుల కారణంగా ఈ నెల 9వ తేది గురువారం నగరంలోని వివిధ ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకుసరఫరా ఉండదని ఈబీ పేర్కొంది. **ఆవడి:** తిరుమలైవాసన్ నగర్, అశోక్ నగర్, పూంపొళిల్ నగర్, కన్నపాళయం, తిరుముల్లైవాయల్ రోడ్డు, రాధాకృష్ణ నగర్, భారతి నగర్. **తిరుముల్లైవాయల్:** ఆర్ప్ ఆంటోని నగర్, పొత్తూరు ఇండస్ట్రీస్.

రూ.14 కోట్లతో తిరువొత్తియూర్‌లో కొత్త బస్టాండ్

స్థానిక తిరువొత్తియూర్‌లో రూ.14 కోట్లతో కొత్త బస్టాండ్ నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. తిరువొత్తియూర్ మాణిక్యం నగర్ మెయిన్ రోడ్డులో బస్టాండ్, డిపో ఉన్నాయి. ఈ బస్టాండ్ నుంచి బ్రాడ్‌వే, వళ్లలార్ నగర్, కోయంబేడు, ఎగ్మూర్, పూందమల్లి తదితర ప్రాంతాలకు 88 ఎంటీసీ బస్సులు నడుపుతున్నారు. బస్టాండ్ శిథిలావస్థకు చేరుకోవడంతో, కొత్త బస్టాండ్ నిర్మించాలని ఆ ప్రాంతవాసులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ క్రమంలో, చెన్నై మెట్రో రైల్ లిమిటెడ్ ఆధ్వర్యంలో రూ.14 కోట్లతో 1.75 ఎకరాల్లో కొత్త బస్టాండ్, డిపో నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. తిరువొత్తియూర్ మెట్రో రైల్వే స్టేషన్ సమీపంలో బస్టాండ్, డిపో ఏర్పాటవుతుండడంతో ప్రజలను అనుకూలంగా ఉండనుంది. ఏడాదిలోగా పనులు పూర్తి చేయనున్నట్లు సీఎంఆర్ఎల్ అధికారులు తెలిపారు.

వండలూరు జూకు జమ్ముకశ్మీర్ నుంచి పిల్లి, ఎలుగు బంట్లు

పెరంబూర్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): స్థానిక వండలూరు జూకు వన్యమృగాల బదిలీ కార్యక్రమంలో భాగంగా జమ్ముకశ్మీర్ నుంచి పిల్లి, ఎలుగు బంట్లు రానున్నాయి. గుజరాత్ చక్కర్‌బాగ్ జులాజికల్ పార్కు నుంచి ఒక మగ, రెండు ఆడ సింహాలు, ఒక ఆడ అడవి గాడిదను వండలూరు జూకు పంపించాలని కేంద్ర జూ అథారిటీకి లేఖ పంపారు. కొద్ది నెలలుగా నిలిచిపోయిన వన్యమృగాల బదిలీకి కేంద్ర జూ అథారిటీ ఆమోదం తెలిపింది. ఆ జంతువులకు బదులుగా ఒక అడవి ఆవు, ఒక జత తెల్ల పులులు, చారల జింకను వండలూరు జూ నుంచి గుజరాత్‌కు పంపించనున్నారు. అదే సమయంలో, సింహం కావడంతో, రాష్ట్ర ముఖ్యమంత్రి ఆమోదం కోసం ఫైల్ పంపించారు. ముఖ్యమంత్రి ఆమోదం లభించిన వెంటనే వాటిని వండలూరుకు తీసుకురానున్నారు. అలాగే, జమ్ము కశ్మీర్ నుంచి ఒక జత పిల్లులు, ఒక ఎలుగు బంటి, ఒక హిమాలయ ఎలుగు బంటి తీసుకురానున్నారు. అందుకు ప్రతిగా, వండలూరు నుంచి ఒక హిప్పోపొటమస్‌ను జమ్ము కశ్మీర్‌కు పంపించనున్నట్లు అధికారులు తెలిపారు.

టీటీడీ క్యాలెండర్, డైరీ విక్రయాలు ప్రారంభం

పెరంబూర్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): స్థానిక టి.నగర్‌లోని వేంకటేశ్వర స్వామి ఆలయం, పద్మావతి అమ్మవారి ఆలయాల్లో వచ్చే ఏడాదికి సంబంధించి తిరుమల తిరుపతి దేవస్థానం క్యాలెండర్లు, డైరీల విక్రయాలు ప్రారంభమయ్యాయి. టి.నగర్‌లో వేంకటేశ్వర స్వామి ఆలయాన్ని ప్రతిరోజు పెద్ద సంఖ్యలో భక్తులు సందర్శిస్తుంటారు. దర్శనం ముగించుకున్న భక్తులకు, తిరుమల ప్రసాదమైన లడ్డూను అందజేస్తుంటారు. అదే సమయంలో, యేటా టీటీడీ ముద్రించిన క్యాలెండర్లు, డైరీలు విక్రయిస్తుంటారు. 12 పేజీల క్యాలెండర్ రూ.130, పెద్ద డైరీ రూ.150కి విక్రయిస్తున్నారు. త్వరలో తెలుగు పంచాంగం, రూ.450 విలువైన బంగారు పూత పూసిన వేంకటేశ్వరస్వామి, అమ్మవారి క్యాలెండర్ విక్రయించనున్నట్లు దేవస్థానం అధికారులు తెలిపారు.

వందే భారత్‌కు కోవిల్‌పట్టిలో హాల్ట్

పెరంబూర్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): చెన్నై ఎగ్మూర్ - తిరునల్వేలి మధ్య నడుపుతున్న (నెం.20665, నెం.20666) వందేభారత్‌కు కోవిల్‌పట్టి స్టేషన్‌లో హాల్ట్ వసతి కల్పించారు. ఎగ్మూర్ - తిరునల్వేలి మధ్య 2023 డిసెంబరులో 8 బోగీల వందేభారత్ సేవలు ప్రారంభమయ్యాయి. ఈ రైలుకు ప్రయాణికుల ఆదరణ పెరగడంతో బోగీల సంఖ్య 20కు పెంచారు. రైలు బోగీలు కూడా తెలుపు నుంచి ఆరెంజ్ రంగుకు మార్చారు. ఈ క్రమంలో, తిరునల్వేలి - చెన్నై వందేభారత్ గురువారం నుంచి కోవిల్‌పట్టిలో రెండు నిమిషాలు ఆగనుంది. ఎగ్మూర్ నుంచి వెళ్లే వందే భారత్ రైలు రాత్రి 9.23 నుంచి 9.25 వరకు, తిరునల్వేలి నుంచి వెళ్లే వందే భారత్ రైలు ఉదయం 6.38 నుంచి 6.40 గంటలు ఆగి వెళ్తాయని దక్షిణ రైల్వే తెలిపింది.

గ్రూప్-2, 2ఏ పరీక్ష కీ విడుదల

పెరంబూర్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): గ్రూప్-2, 2ఏ పరీక్షల కీని టీఎన్‌పీఎస్సీ విడుదల చేసింది. టీఎన్‌పీఎస్సీ గ్రూప్-2, 2ఏ విభాగాలకు సంబంధించి ఖాళీగా ఉన్న 645 పోస్టుల భర్తీకి గత నెల 28వ తేది రాత పరీక్ష నిర్వహించింది. ఈ పరీక్షలకు 5,53,634 మంది దరఖాస్తు చేసుకోగా, 4,18,791 మంది హాజరయ్యారు. ఆ ప్రకారం, ఒక పోస్టుకు 649 మంది పోటీపడుతున్నారు. ఈ క్రమంలో, ఈ పరీక్ష కీ www.tnpsc.gov.in లో విడుదల చేశారు. కీలోని సమాధానాలపై అప్పీలు చేసుకోవాలనే అభ్యర్థులు, ఈ నెల 14వ తేది సాయంత్రం 5.45 గంటలల్లోపు టీఎన్‌పీఎస్సీ వెబ్‌సైట్‌లో చేసుకోవచ్చు. ' కీ సెలక్షన్' విండోను ఉపయోగించి మాత్రమే అప్పీలు చేసుకోవాలి. పోస్ట్, ఈ-మెయిల్ ద్వారా పంపించే అప్పీళ్లు స్వీకరించబోమని టీఎన్‌పీఎస్సీ పరీక్ష కంట్రోలర్ షణ్ముగ సుందరం తెలిపారు.

తిరుచెందూర్‌లో వెనక్కి వెళ్లిన సముద్రం

● నీటమునిగి భక్తుడి మృతి

చెన్నై, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): తిరుచెందూర్ సముద్రం బుధవారం కూడా సుమారు 120 మీటర్ల వెనక్కి వెళ్లింది. ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రం తిరుచెందూర్ సుబ్రహ్మణ్యస్వామి ఆలయానికి ప్రతిరోజు భక్తులు పెద్దసంఖ్యలో వస్తుంటారు. భక్తులు తొలుత ఆలయం వెనుక సముద్రతీరంలో పుణ్యస్నానాలు ఆచరిస్తుంటారు. కాగా, పౌర్ణమి, అమావాస్య తదితర రోజుల్లో తిరుచెందూర్ సముద్రం వెనక్కి వెళ్లడం సర్వసాధారణం. ఈ మేరకు మంగళవారం పౌర్ణమి కావడంతో సముద్రం సుమారు 100 మీటర్ల వెనక్కి వెళ్లింది. బుధవారం ఉదయం కూడా సముద్రం 120 అడుగుల వెనక్కి వెళ్లింది. దీంతో, పాచిపట్టిన బండరాళ్లు, సముద్ర జీవులు కనిపించాయి. కొద్ది సమయం తర్వాత సముద్రం యథాస్థితికి చేరుకుంది. కాగా, కోయంబత్తూర్‌కు చెందిన మణికంఠన్ బుధవారం తిరుచెందూర్ చేరుకుని సముద్రంలో స్నానం చేస్తున్న సమయంలో, హఠాత్తుగా వచ్చిన భారీ అలకు కొట్టుకుపోయాడు. కొద్దిసేపటి అనంతరం మణికంఠన్ మృతదేహం తీరానికి కొట్టుకువచ్చింది. ఈ ఘటనపై తిరుచెందూర్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

మందుబాబుల అడ్డాగా ఎమ్మార్వో కార్యాలయం





కార్యాలయ ప్రాంగణంలో పడి ఉన్న మద్యం సీసాలు

తిరుత్తణి, అక్టోబర్ 8 (ఆంధ్రజ్యోతి): ఎమ్మార్వో కార్యాలయ ప్రాంగణం మందుబాబులకు అడ్డాగా మారుతోందని ప్రజలు ఫిర్యాదు చేశారు. తిరువళ్లూరు జిల్లా పళ్లిపట్టులోని ఎమ్మార్వో కార్యాలయానికి ప్రతిరోజు క్యాస్ట్ సర్టిఫికేట్, ఆధార్ అప్‌డేట్, భూసర్వే తదితర పనుల నిమిత్తం 38 గ్రామాల ప్రజలు వస్తుంటారు. ఈ నేపథ్యంలో, కార్యాలయ ప్రాంగణాన్ని గత 6 నెలలుగా శుభ్రంచేయకపోవడంతో విపరీతంగా పిచ్చి చెట్లు పెరిగాయి. దీంతో రాత్రివేళల్లో తాగుబోతుల అసాంఘిక కార్యకలాపాలకు ఆ ప్రాంతం అడ్డాగా మారింది. ఇదిలా ఉండగా పగటిపూట కూడా మందుబాబులు విచ్చలవిడిగా మద్యం తాగి కార్యాలయానికి వచ్చేవాళ్లను భయభ్రాంతులకు గురిచేస్తున్నట్లు సమాచారం. దీనిపై ప్రజలు పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని తెలిసింది. ఎక్కడపడితే అక్కడ మద్యం సీసాలను పడేసి కార్యాలయ ప్రాంగణాన్ని మందుబాబుల అడ్డాగా మార్చుకున్నారని ప్రజలు వాపోతున్నారు. దీనిపై జిల్లా కలెక్టర్, పోలీసు అధికారులు తగిన చర్యలు తీసుకోవాల్సి ఉంది.

కరూర్ దుర్ఘటనలో క్షతగాత్రులకు రూ.లక్ష సాయం

● అందజేసిన మాజీ మంత్రి సెంథిల్‌బాలాజి



టీవీకే రోడ్‌షో తొక్కిసలాటలో గాయపడిన మహిళ కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న మాజీ మంత్రి సెంథిల్‌బాలాజి

చెన్నై, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): కరూర్ వేలుచ్చామిపురంలో గత సెప్టెంబరు 27 రాత్రి తమిళ వెట్రి కళగం అధినేత విజయ్ రోడ్‌షో సందర్భంగా జరిగిన తొక్కిసలాటలో గాయపడినవారికి మాజీ మంత్రి, ఆ నియోజకవర్గ డీఎంకే ఎమ్మెల్యే సెంథిల్ బాలాజి బుధవారం ఉదయం ప్రభుత్వం ప్రకటించిన రూ.లక్ష చొప్పున ఆర్థికసాయాన్ని అందజేశారు. టీవీకే రోడ్‌షోలో చిన్నారులు, మహిళలు సహా మొత్తం 41 మంది ప్రాణాలు కోల్పోయిన సంగతి తెలిసిందే. ఆ దుర్ఘటనలో వందమందికి పైగా గాయపడి వివిధ ప్రభుత్వ ఆసుపత్రులలో చేరి చికిత్సలు పొందారు. దుర్ఘటనలో ప్రాణాలు కోల్పోయినవారి కుటుంబాలకు సీఎం స్టాలిన్ ప్రకటించినట్లు తలా రూ.10లక్షల ఆర్థిక సహాయాన్ని ఇదివరకే పంపిణీ చేశారు. ఈ నేపథ్యంలో బుధవారం ఉదయం సెంథిల్‌బాలాజి దుర్ఘటనలో గాయపడి చికిత్సల తర్వాత కోలుకున్నవారి ఇళ్లకు స్వయంగా వెళ్లి తలా రూ.లక్ష వంతున ఆర్థికసహాయం అందించారు. ఇదే విధంగా స్వల్పంగా గాయపడినవారికి తలా రూ.50 వేలు చొప్పున పంపిణీ చేశారు. మొత్తం 45 మంది క్షతగాత్రులకు ఈ సాయం అందించినట్లు సెంథిల్‌బాలాజి తెలిపారు.

ప్రజా సమస్యలపై ప్రత్యేక దృష్టి

నగర పోలీసు కమిషనర్ అరుణ్



ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న కమిషనర్ అరుణ్

పెరంబూర్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించాలని గ్రేటర్ చెన్నై పోలీసు కమిషనర్ అరుణ్ అధికారులను ఆదేశించారు. స్థానిక వెప్పేరిలోని నగర పోలీసు కమిషనర్ కార్యాలయంలో బుధవారం ప్రజా గ్రీవెన్స్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నగర పోలీసు కమిషనర్ అరుణ్ పాల్గొని, ప్రజల నుంచి 18 వినతి పత్రాలు స్వీకరించారు. అనంతరం వారి సమస్యలు సావధానంగా విన్నారు. ఈ సమస్యలపై విచారణ జరిపి తగిన చర్యలు చేపట్టాలని కమిషనర్ సంబంధిత పోలీసు స్టేషన్ల అధికారులను ఆదేశించారని నగర పోలీసు శాఖ ఒక ప్రకటనలో తెలిపింది.

నయినార్ నాగేంద్రన్ ప్రచార యాత్రకు పోలీసు శాఖ అనుమతి



బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు నయినార్ నాగేంద్రన్

పెరంబూర్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): మదురై నుంచి ఈనెల 12న బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు నయినార్ నాగేంద్రన్ 'తమిళగం నిమిర తమిళనిన్ పయనం' పేరుతో చేపట్టనున్న ప్రచారానికి నగర పోలీసు శాఖ అనుమతులు జారీచేసింది. అన్నాడీఎంకే కూటమిలో ఉన్న బీజేపీ, వచ్చే ఏడాది జరగనున్న రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలను ఎదుర్కొనేలా సిద్ధమవుతోంది. ఇందులో భాగంగా ఈ నెల 12వ తేది నుంచి రాష్ట్ర వ్యాప్త ప్రచారానికి నాగేంద్రన్ శ్రీకారం చుట్టారు. ఆ ప్రకారం, ఈ ప్రచారాన్ని బీజేపీ జాతీయ అధ్యక్షులు జేపీ నడ్డా ప్రారంభించనున్నారు. మదురైలో ప్రారంభించి శివగంగ, చెంగల్పట్టు, చెన్నై ఉత్తరం, సెంట్రల్ చెన్నై, పెరంబలూరులో ప్రచారం చేయనున్నారు. ఈ నేపథ్యంలో, మదురైలో ప్రచారానికి అనుమతులు కోరుతూ మదురై నగర పోలీసు కమిషనర్ కార్యాలయంలో మదురై కార్పొరేషన్ జిల్లా అధ్యక్షుడు మారి చక్రవర్తి దరఖాస్తు చేసుకున్నారు. దరఖాస్తులో... మదురై కె.పుదూర్ బస్టాండ్, మునిరోడ్డు జంక్షన్, అన్నానగర్ అంబికా థియేటర్ సహా ఐదు ప్రాంతాల్లో యాత్ర ప్రారంభించేందుకు అనుమతులు ఇవ్వాలని కోరారు. దరఖాస్తును పరిశీలించిన పోలీసు శాఖ, అన్నా నగర్ అంబికా థియేటర్ జంక్షన్‌లో ప్రచారం ప్రారంభించేందుకు అనుమతించింది. అదే సమయంలో, కార్యకర్తలు తాగునీరు, బిస్కెట్లు అందించాలని, వృద్ధులు, గర్భిణులు, పిల్లలు యాత్రలో పాల్గొనకుండా చూడాలని సహా పలు నిబంధనలను పోలీసు శాఖ విధించింది.

వేతనాలు పెంచాలని కోరుతూ అంబులెన్స్ ఉద్యోగుల నిరసన



వేలూరు, అక్టోబర్ 8 (ఆంధ్రజ్యోతి): వేలూరు జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు బుధవారం అంబులెన్స్ ఉద్యోగులు ఆందోళనకు దిగారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఉద్యోగుల సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాజేంద్రన్ హాజరయ్యారు. అనంతరం జిల్లా ఈఎంఆర్ఐ అధ్యక్షుడు నవీన్ మాట్లాడుతూ... అంబులెన్స్ సిబ్బందికి ఇస్తున్న వేతనాలను పెంచాలని కోరుతూ గత కొన్నేళ్లుగా రాష్ట్రప్రభుత్వానికి విజ్ఞప్తి చేసినా ఫలితంలేదని వాపోయారు. వేతనాలు చాలక ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, రాత్రింబవళ్ల ప్రజల ప్రాణాల కాపాడే తమకు వేతనాలు పెంచి ఆదుకోవాలని పభుత్వాన్ని కోరారు. ఈఎంఆర్ఐ జిల్లా కార్యదర్శి రంజిత్, రాష్ట్ర కోశాధికారి స్వామివేల్, నిర్వాహకులు మహదేవన్, ప్రవీణ్, అంబులెన్స్ ఉద్యోగులు పాల్గొన్నారు.

భోజనశాలలో భక్తుల ఇక్కట్లు తీర్చండి



పొగ వ్యాపించడంతో బయటకి వెళుతున్న భక్తులు

తిరుత్తణి, అక్టోబర్ 8 (ఆంధ్రజ్యోతి): తిరుత్తణిలో మురుగన్ ఆలయానికి ప్రతిరోజు రాష్ట్రం నుంచే కాకుండా ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, కేరళ తదితర రాష్ట్రాల నుండి వేలాదిగా భక్తులు తరలివస్తుంటారు. భక్తులకు ఆలయ నిర్వాహణలో అన్నశాల ఆకలిని తీరుస్తోంది ఆలయ ట్రస్ట్. ఈ నేపథ్యంలో, అన్నశాల నిర్వహించే పాత భవనం శిథిలావస్థకు చేరుకుంది. దీంతో సుమారు రూ.86కోట్లతో కొత్త అన్నశాలను నిర్మిస్తున్నారు. నిర్మాణం పనులు ప్రారంభించి చాలా నెలలు గడిచినా.. ఇంకా ఆ నూతన భవనంలోకి మార్చలేదు. దీంతో పాత భవనంలోనే భక్తులకు అన్నదానం జరుగుతోంది. ఇదిలా ఉండగా, బుధవారం మధ్యాహ్నం జరిగిన అన్నదానంలో వంట కారణంగా వస్తున్న పొగతో భక్తులకు ఊపిరాడక అన్నం తినకుండానే వెళ్లిపోయారు. దీనిపై అధికారులు స్పందించి తక్షణ చర్యలు చేపట్టాలని భక్తులు కోరుతున్నారు.

పిచ్చికుక్క దాడిలో 10 మంది విద్యార్థులకు గాయాలు



విద్యార్థులను పరామర్శిస్తున్న అధికారులు

చెన్నై, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): పిచ్చికుక్క దాడిలో 10 మంది విద్యార్థులకు గాయాలయ్యాయి. తూత్తుకుడి జిల్లా ఒట్టపిడారం సమీపం క్రాస్ వీధిలో ప్రభుత్వ మహోన్నత పాఠశాల ఉంది. ఈ పాఠశాలలో చుట్టుపక్కల గ్రామాలకు చెందిన విద్యార్థులు చదువుకుంటున్నారు. బుధవారం ఉదయం విద్యార్థులు యథావిధిగా పాఠశాలకు వెళుతున్న సమయంలో, ఊహించని విధంగా ఆ మార్గంగా వచ్చిన పిచ్చికుక్క విద్యార్థులపై దాడిచేసింది. ఈ ఘటనలో 10 విద్యార్థుల కాళ్లు, చేతులకు గాయాలయ్యాయి. గాయపడిన వారిని సమీపంలోని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. సమాచారం అందుకున్న తాలూకా ఆరోగ్య శాఖ అధికారులు ఆస్పత్రికి చేరుకుని విద్యార్థులను పరామర్శించారు. అలాగే, పిచ్చికుక్కను బంధించా లని ఆదేశాలు జారీ చేశారు.

వర్షాలపై అప్రమత్తంగా ఉండండి

● అధికారులకు కలెక్టర్ ఆదేశం



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సుబ్బులక్ష్మి

వేలూరు, అక్టోబర్ 8 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ద్రోణి ప్రభావంతో రానున్న రోజుల్లో అత్యధిక వర్షపాతం నమోదు కానుందని వాతావరణశాఖ హెచ్చరికల నేపథ్యంలో బుధవారం ఉదయం వేలూరు జిల్లా కలెక్టరేట్‌లో కలెక్టర్ సుబ్బులక్ష్మి నేతృత్వంలో అధికారుల ప్రత్యేక సమావేశం జరిగింది. ఈ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ, నదులు, చెరువులు, వాగుల సమీపంలో గ్రామాల ప్రజలను అప్రమత్తం చేయాలని, ముంపు ప్రాంతాలను గుర్తించి హెచ్చరికలు జారీచేయాలని ఆదేశించారు. అలాగే ప్రజలను పునరావాసకేంద్రాలకు తరలించాలన్నారు.

వరల్డ్ స్టాండర్స్‌డే ప్రత్యేక సదస్సు



వేదికపై మాట్లాడుతున్న కలెక్టర్ సుబ్బులక్ష్మి

వేలూరు, అక్టోబర్ 8 (ఆంధ్రజ్యోతి): జాతీయ క్వాలిటీ కమిటీ ఆధ్వర్యంలో హోటల్ బెంజ్‌పార్క్‌లో వేలూరు జిల్లా కలెక్టర్ సుబ్బులక్ష్మి అధ్యక్షతన బుధవారం ఉదయం ప్రత్యేక సదస్సు జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... ఉత్పత్తుల నాణ్యత కమిటీ నిర్వాహకుల పనితీరును ప్రశంసనీయమన్నారు. ఈ కార్యక్రమంలో కమిటీ అధ్యక్షుడు విజ్ఞాని, నిర్వాహక అధికారి దయానంద్, డాక్టర్ మోహన్, అసిస్టెంట్ డైరెక్టర్ గాయత్రి, జనరల్ మేనేజర్ బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

ఈవీఎం నిర్వహణపై కలెక్టర్ పరిశీలన

వేలూరు, అక్టోబర్ 8 (ఆంధ్రజ్యోతి): రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో వినియోగించే ఈవీఎంల నిర్వహణను బుధవారం ఉదయం కలెక్టర్ సుబ్బులక్ష్మి పరిశీలించారు. అనంతరం వివిధ పార్టీలకు చెందిన నేతలతో ఆమె సమావేశమై ఎన్నికల విధివిధానాలను వివరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రానున్న ఎన్నికల నేపథ్యంలో ఈవీఎంల పనితీరుపై రాజకీయ నేతలతో కలిసి చర్చించామన్నారు. ప్రతి ఒక్క ఓటరు తమ ఓటు హక్కును రానున్న ఎన్నికల్లో సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ జనరల్ పీఏ ముత్తయ్యన్, తహసీల్దారు సత్యమూర్తి పలు పార్టీలకు చెందిన నేతలు పాల్గొన్నారు.

విల్లుపురంలో విద్యుత్ కార్మికుల ధర్నా



ధర్నాలో పాల్గొన్న విద్యుత్ కార్మికులు

చెన్నై, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): అర్హత కలిగినవారందరికీ పదోన్నతులు కల్పించాలని, వేతనాలు పెంచాలని కోరుతూ విల్లుపురంలో విద్యుత్ బోర్డు కార్మికులు, ఉద్యోగులు రెండో రోజూ ధర్నా నిర్వహించారు. విద్యుత్‌బోర్డులో ఐదేళ్లుగా పదోన్నతులకు నోచుకోని గ్యాంగ్‌మన్‌లకు పదోన్నతులు కల్పించాలని, 2019 డిసెంబర్ 1 నుంచి చెల్లించాల్సిన 6 శాతం వేతన పెంపు బకాయిలను చెల్లించాలని, గ్యాంగ్‌మన్‌లను సొంతజిల్లాలకు బదిలీ చేయాలని కోరుతూ మంగళవారం ఉదయం సిఐటీయూ ఆధ్వర్యంలో విద్యుత్‌బోర్డు సూపరింటెండెంట్ ఇంజనీర్ కార్యాలయం ఎదుట ధర్నా ప్రారంభించారు. బుధవారం ఈ ఆందోళన కొనసాగింది. ధర్నాకు సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి కె.అంబికాపతి నేతృత్వం వహించారు. సీఐటీయూ నేతలు ఆర్.శేఖర్, ఆర్.అరుళ్, కన్నన్, ఎ.కన్నియప్పన్, కె.ఏళుమలై, అశోక్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

తరగతి గదిలో స్పృహతప్పి ప్లస్ వన్ విద్యార్థి మృతి



వెంకటేశన్ (ఫైల్‌ఫోటో)

పెరంబూర్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): కుండ్రత్తూర్ ప్రభుత్వ పాఠశాల తరగతిలో ప్లస్ వన్ విద్యార్థి స్పృహతప్పి పడి మృతి చెందాడు. కాంచీపురం జిల్లా మణికంఠన్ నగర్‌కు చెందిన శరవణన్ కుమారుడు వెంకటేశన్(16) కుండ్రత్తూర్ సమీపం కొల్లచేరిలో ఉన్న ప్రభుత్వ పాఠశాలలో ప్లస్‌వన్ చదువుతున్నాడు. త్రైమాసిక పరీక్షలు ముగిసి సోమవారం పాఠశాలలు ప్రారంభమయ్యాయి. తరగతి గదిలో కొద్దిసేపటికి వెంకటేశన్ స్పృహతప్పి పడిపోయాడు. సహచర విద్యార్థులు, ఉపాధ్యాయులు అతన్ని వెంటనే సమీపంలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించి, ప్రాథమిక చికిత్సల అనంతరం చెన్నై ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్సలు ఫలించక మంగళవారం వెంకటేశన్ మృతిచెందాడు. ఈ ఘటనపై కుండ్రత్తూర్ పోలీసులు కేసు నమోదుచేసి విచారణ చేపట్టారు.

కాంట్రాక్టర్‌ను బెదిరించి రూ.10 లక్షల దోపిడీ

అడయార్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): నగర శివారు ప్రాంతమైన తిరువేర్కాడులో కాంట్రాక్టరును బెదిరించి రూ.10 లక్షల నగదును దోపిడీ చేశారు. దీనిపై స్థానిక పోలీసులు కేసు నమోదు చేసి పరారీలో ఉన్న దుండగుల కోసం గాలిస్తున్నారు. కోడంబాక్కానికి చెందిన సుధాకర్ రోడ్డు నిర్మాణ కాంట్రాక్టరు. ఆయన రూ.10 లక్షల విలువ చేసే రూ.500 నోట్ల కట్టలను రూ.100, రూ.200 నోట్లుగా మార్చాలని భావించారు. ఇందుకోసం తనకు తెలిసిన తిరువేర్కాడు, అయనంబాక్కానికి చెందిన మణికంఠన్, శ్రీపెరుంబుదూరుకు చెందిన తిరునావుక్కరసుని సంప్రదించాడు. కమిషన్ విధానంలో రూ.10 లక్షలను చిల్లర నోట్లగా మార్చేందుకు సమ్మతించారు. దీంతో మంగళవారం తన స్నేహితులు కిషోర్, చంద్రశేఖర్‌తో కలిసి రూ.10 లక్షలను తీసుకుని తిరువేర్కాడుకు వెళ్లి మణికంఠన్, తిరునావుక్కరసు కోసం వేచి చూస్తుండగా, నలుగురు వ్యక్తులు రెండు బైకుల్లో వచ్చిన సుధాకర్, అతని స్నేహితులను బెదిరించి వారివద్ద ఉన్న నోట్ల కట్టలను దోచుకుని పారిపోయారు. ఈ హఠాత్ పరిమాణంతో షాక్‌కు గురైన సుధాకర్.. నెమ్మదిగా తేరుకుని తిరువేర్కాడు పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసి దోపిడీ దొంగల కోసం గాలిస్తున్నారు.

ఐటీ ఉద్యోగినిని వేధించిన చిత్తూరు వ్యాపారి

● అరెస్టు చేసిన సేలం రైల్వే పోలీసులు

అడయార్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): రాణిపేటకు చెందిన ఐటీ ఉద్యోగినిని రైలులో లైంగికంగా వేధించిన కేసులో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని చిత్తూరుకు చెందిన వస్త్ర వ్యాపారి శంకర్ (45)ను సేలం రైల్వే పోలీసులు బుధవారం వేకువజామున అరెస్టు చేశారు. ఈ కేసు వివరాలను పరిశీలిస్తే, రాణిపేటకు చెందిన 24 యేళ్ల యువతి బెంగళూరులోని ఒక ఐటీ కంపెనీలో పనిచేస్తోంది. ఈ యువతి తన సొంతూరుకు వెళ్లేందుకు బెంగళూరు నుంచి బయలుదేరే కుర్లా ఎక్స్‌ప్రెస్‌లో రిజర్వేషన్ చేసుకుంది. ఈ రైలు బుధవారం వేకువజామున ధర్మపురి స్టేషన్ దాటింది. ఆ సమయంలో అదే బోగీలో ప్రయాణిస్తున్న శంకర్ ఆ యువతిని లైంగికంగా వేధించాడు. దీంతో ఆ యువతి కేకలు వేయడంతో ఇతర ప్రయాణికులు రైల్వే పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ రైలు సేలంకు రాగానే రైల్వే పోలీసులు శంకర్‌ను అదుపులోకి తీసుకుని విచారించారు. అతనిపై కేసు నమోదు చేసి అరెస్టు చేశారు.

న్యాయమూర్తిపైకి చెప్పు విసిరిన ఖైదీ

పెరంబూర్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): తిరునల్వేలి జిల్లా చేరన్మహాదేవి కోర్టులో ఓ విచారణ ఖైదీ న్యాయమూర్తి పైకి చెప్పు విసిరిన ఘటన కలకలం రేపింది. మధ్యప్రదేశ్ రాష్ట్రం రివా జిల్లాకు చెందిన ధీరేంద్ర సింగ్ (30) తిరునల్వేలి ప్రభుత్వ వైద్యకళాశాల ఆస్పత్రి ప్రాంగణంలో జరిగిన చోరీ కేసులో అరెస్టై బందీగా ఉన్నాడు. కేసు విచారణ కోసం పోలీసులు అతన్ని జైలు నుంచి చేరన్మహాదేవి కోర్టుకు తీసుకొచ్చారు. కోర్టు హాలు వెలుపల కూర్చున్న ధీరేంద్ర సింగ్, హఠాత్తుగా తన చెప్పు తీసి కోర్టు హాలులో ఉన్న న్యాయమూర్తి పైకి విసిరాడు. అయితే ఆ చెప్పు ఎవరి మీదా పడలేదు. ఈ ఘటనతో కోర్టు హాలులో కొద్దిసేపు గందరగోళం నెలకొంది. అనంతరం అతన్ని మళ్లీ జైలుకు తరలించారు.

పిడుగుపాటుకు యువకుడి మృతి

పెరంబూర్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): పిడుగుపాటుకు యువకుడు మృతిచెందాడు. రామనాథపురం పరమకుడికి చెందిన ముత్తుకుమార్ బుధవారం ఉదయం మేకలను తోలుకుని సమీపంలోని పొలాలకు వెళ్లాడు. ఆ సమయంలో ఒక్కసారిగా ఉరుములు, పిడుగులతో కూడిన భారీ వర్షం కురిసింది. దీంతో, ముత్తుకుమార్ సమీపంలోని చెట్టు కిందకు వెళ్లిన సమయంలో, పక్కనే పిడుగుపడడంతో విద్యుదాఘాతానికి గురై ఘటనా స్థలంలోనే మృతిచెందాడు. ఈ ఘటనపై పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

బీజేపీ నేతల ఆధ్వర్యంలో ఉచిత నేత్రశిబిరం



వైద్యశిబిరంలో పాల్గొన్న ప్రజలు

వేలూరు, అక్టోబర్ 8 (ఆంధ్రజ్యోతి): వేలూరు జిల్లా బీజేపీ నేతల ఆధ్వర్యంలో ఉచిత నేత్ర వైద్య శిబిరం జరిగింది. వేలూరు - ఆరణి రోడ్డులోని సోలాపురియమ్మన్ ఆలయ ప్రాంగణంలో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు దశరథన్ హాజరయ్యారు. ఈ నేపథ్యంలో సుమారు 300 మంది వృద్ధులు, చిన్నారులకు వైద్యులుకంటి పరీక్షలు నిర్వహించారు. అనంతరం రోగులకు కంటి అద్దాలు, మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి శరవణన్, మండల అధ్యక్షుడు హరి, వేలూరు రోటరీ సంఘ నిర్వాహకులు రమేష్, మురళి, రాజ్ సహా బీజేపీ కార్యకర్తలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉద్యోగి ఇంట్లో చోరీకి పాల్పడిన ముగ్గురి అరెస్ట్



నిందితులు

వేలూరు, అక్టోబర్ 8 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉద్యోగి ఇంట్లో చోరీకి పాల్పడిన ముగ్గురిని పోలీసులు అరెస్ట్ చేశారు. వేలూరు వ్యవసాయశాఖలో అసిస్టెంట్ మేనేజర్‌గా పనిచేస్తున్న మోహన్ కుమార్ ఈనెల 2న గురువారం తన కుటుంబంతో కలిసి కాట్పాడిలో ఉన్న బంధువుల ఇంటి వెళ్లారు. తిరిగి ఇంటికి చేరుకున్నారు. ప్రధాన ద్వారం తాళం పగులగొట్టి ఉండటాన్ని గమనించి లోపలికి వెళ్లి చూడగా, బీరువాలోని నగలు, నగదు చోరీకి గురయ్యాయని నిర్ధారించుకుని పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరు కుని పరిశీలించారు. కేసు నమోదు చేసి గాలింపు చర్యలు ముమ్మరం చేశారు. ఈ నేపథ్యంలో కాట్పాడిలో నిఘాను పటిష్ఠం చేసిన పోలీసులు అనుమానాస్పదంగా సంచరిస్తున్న ముగ్గురిని తనిఖీ చేశారు. వారి నుంచి 15సవర్ల నగలు స్వాధీనం చేసుకుని పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లి పూర్తిస్థాయిలో విచా రించారు. గత కొన్నిరోజులుగా ఆ ప్రాంతాల్లో వరుస చోరీలకు పాల్ప డుతున్న దొంగలు వీరేనని విచారణలో తేలింది. ఉసిలంపట్టికి చెందిన కనక వేల్, తిరుత్తణి అంబేడ్కర్‌నగర్‌కు చెందిన సతీష్, చెన్నై అంబత్తూరుకు చెందిన పొన్‌మురుగన్‌గా గుర్తించారు. కోర్టు ఉత్తర్వుల మేరకు రిమాండ్‌కు తరలించారు.

బాలికకు గర్భం: యువకుడి అరెస్ట్

చెన్నై, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): బాలికను గర్భిణిని చేసిన యువకుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. తేని జిల్లాకు చెందిన 15 ఏళ్ల బాలికను అదే ప్రాంతానికి చెందిన యువకుడు (23) ప్రేమిస్తున్నానని ఆశచూపి లైంగిక వేధింపులకు పాల్పడినట్లు సమాచారం. బాలిక కొద్దిరోజులుగా అస్వస్థతగా ఉండడంతో, తల్లిదండ్రులు ఆమెను ఆస్పత్రికి తీసుకెళ్లారు. బాలికకు వైద్య పరీక్షలు నిర్వహించిన వైద్యులు, రెండు నెలల గర్భంతో ఉందని చెప్పడంతో తల్లిదండ్రులు దిగ్భ్రాంతి చెందారు. తల్లిదండ్రుల ఫిర్యాదుపై ఈ వ్యవహారంపై విచారణ చేపట్టిన పోలీసులు, పోక్సో చట్టం కిం కేసు నమోదుచేసి యువకుడిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరచి జైలుకు తరలించారు.


'వా వాత్తియార్'లో కార్తి, కృతిశెట్టి

డిసెంబరు 5న 'వా వాత్తియార్' రిలీజ్

కార్తి హీరోగా నలన్ కుమార స్వామి దర్శకత్వంలో రూపుదిద్దుకుంటున్న 'వా వాత్తియార్' సినిమాను డిసెంబరు 5వ తేదీన విడుదల చేయనున్నట్టు నిర్మాతలు ప్రకటించారు. స్టూడియో గ్రీన్ పతాకంపై ప్రముఖ నిర్మాత కేఈ జ్ఞానవేల్ రాజా ఈ చిత్రాన్ని నిర్మించారు. కార్తి - నలన్ కుమారస్వామి కాంబినేషన్ అధికారికంగా ఖరారైనప్పటి నుంచి ఈ చిత్రంపై భారీ అంచనాలు నెలకొన్నాయి. దీనికితోడు చిత్ర టైటిల్, మూవీ లుక్స్ సరికొత్తగా ఉండటంతో ప్రేక్షకుల్లో ఈ అంచనాలు మరింతగా పెరిగాయి. ఈ నేపథ్యంలో డిసెంబరు 5వ తేదీన థియేటర్లలో విడుదల చేయనున్నట్టు చిత్ర బృందం అధికారికంగా ప్రకటించింది. ఇందులో కృతిశెట్టి హీరోయిన్. ఇతర పాత్రల్లో సత్యరాజ్, రాజ్‌కిరణ్, జీఎం సుందర్ వంటి ప్రధాన తారాగణం నటించారు. ప్రముఖ సినిమాటోగ్రాఫర్ జార్జ్ విలియమ్స్ ఛాయాగ్రహణం అందించగా, సంతోష్ నారాయణన్ సంగీతం సమకూర్చారు. స్టంట్స్ అనల్ అరసు. ఈ సినిమా ఆడియో, ట్రైలర్ విడుదల తేదీలను త్వరలోనే వెల్లడించనున్నారు.

'కంబి కట్న కథై'లో లాజిక్ చూడొద్దు : నిర్మాత రవి

● దీపావళికి రిలీజ్

ఒక హాస్య స్వామీజీని నేపథ్యంగా తీసుకుని నిర్మించిన 'కంబి కట్న కథై'లో లాజిక్‌లు చూడొద్దని ఆ చిత్ర నిర్మాత రవి అన్నారు. నట్టి నటరాజ్, షాలిని, శ్రీరంజిని జంటగా నటించిన ఈ చిత్రం దీపావళికి విడుదల కానుంది. ఇతర పాత్రల్లో సింగంపులి, జావా సుందరేశన్, మురుగానందం, కోదండన్, ముకేష్ రవి, ముత్తురామన్, కరాటే కార్తిక్, టీఎస్ఆర్ తదితరులు నటించారు. రాజనాథన్ పెరియస్వామి దర్శకుడు. మంగాతా ఫిలిమ్స్ పతాకంపై నిర్మాత రవి నిర్మించారు. సంగీతం సతీష్. ఈ చిత్ర ఆడియో విడుదల వేడుక మంగళవారం జరిగింది. ఇందులో ముఖ్య అతిథిగా ప్రముఖ నిర్మాత కలైపులి ఎస్.థాను పాల్గొన్నారు. ముందుగా చిత్ర నిర్మాత రవి మాట్లాడుతూ... 'ఒక హాస్యభరిత స్వామీజీని నేపథ్యంగా చేసుకుని ఈ చిత్రాన్ని నిర్మించాం. ఇందులో స్వామీజీగా నట్టి నటించేందుకు అంగీకరించడంతోనే ఈ స్క్రిప్టుకు సగం విజయం చేకూరింది. ఈ చిత్ర కథ 22 యేళ్లుగా నాతో పయనించింది. నిర్మాణంలో ఏమాత్రం రాజీ పడలేదు. ఇది ఒక లాజిక్ లేని సినిమా. రెండో భాగం నిర్మించేందుకు అవకాశం ఉంది' అని పేర్కొన్నారు. హీరో నట్టి మాట్లాడుతూ... 'సాధారణంగా ఒక నిర్మాత తన తొలి చిత్ర నిర్మాణ ఖర్చుల్లో ఆచితూచి అడుగులు వేస్తారు. కానీ, రవి మాత్రం ఎక్కడా రాజీ పడకుండా ఈ సినిమాను తెరకెక్కించారు. చిన్న కామన్ పాయింట్‌తో ఈ చిత్రం రూపుదిద్దుకుంది. ప్రతి ఒక్కరికీ నచ్చుతుంది. సినిమా చూస్తున్నంత సేపు హాయిగా కడుపుబ్బ నవ్వుకుంటారు' అని పేర్కొన్నారు. చిత్ర దర్శకుడు రాజనాథన్ మాట్లాడుతూ... 'మాస్ మూవీగా రూపొందించా. హాస్యం పాళ్లు ఎక్కువగా ఉంటాయి. ఈ చిత్రం ఆడియో హక్కులు కొనుగోలు చేసిన కంపెనీకి, సినిమాను విడుదల చేస్తున్న హరి ఉత్రాకు ధన్యవాదాలు' అని పేర్కొన్నారు.


'కంబి కట్న కథై' ఆడియో ఆవిష్కరణ వేడుక

చిత్రజ్యోతి



అరివళగన్ దర్శకత్వంలో అదితి శంకర్

తమిళ చిత్రపరిశ్రమలోని ప్రముఖ దర్శకుల్లో ఒకరైన అరివళన్ డైరెక్షన్‌లో యువ నటి అదితి శంకర్ నటించనున్నారు. దిగ్గజ దర్శకుడు శంకర్ కుమార్తెగా చిత్రపరిశ్రమలోకి అడుగుపెట్టిన అదితి శంకర్.. తమిళ, తెలుగు భాషల్లో నటించినప్పటికీ సరైన బ్రేక్ లభించలేదు. దీంతో ఆమెకు రెండు భాషల్లో సినిమా అవకాశాలు సన్నగిల్లాయి. ఇప్పటివరకు అల్లరి పిల్లగా నటించి ప్రేక్షకులను మెప్పించిన అదితి... అరివళగన్ చిత్రంలో మాత్రం గత చిత్రాలకు భిన్నమైన పాత్రలో నటించనుంది. హీరో అరుణ్ విజయ్ స్నేహితుడు ఇంద్రజిత్ ఈ చిత్రాన్ని నిర్మించనున్నారు. ఈ ప్రాజెక్టు కోసం నటీనటులు, సాంకేతిక నిపుణులు, లొకేషన్ల ఎంపికపై ముమ్మరంగా కసరత్తు చేస్తున్నారు.

'వేల్స్ మ్యూజిక్' కంపెనీ ప్రారంభం


'వేల్స్ మ్యూజిక్' ప్రారంభోత్సవంలో పాల్గొన్న సినీ ప్రముఖులు

● నిర్మాత ఐసరి కె.గణేష్ కొత్త జర్నీ

ప్రముఖ సినీ నిర్మాత, వేల్స్ గ్రూపు విద్యా సంస్థల అధినేత డాక్టర్ ఐసరి కె.గణేష్ 'వేల్స్ మ్యూజిక్ ఇంటర్నేషనల్' పేరుతో మ్యూజిక్ కంపెనీని నెలకొల్పి కొత్త జర్నీని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఫిల్మ్ ప్రొడక్షన్, మ్యూజిక్ థియేటర్లు, పోస్ట్ ప్రొడక్షన్, స్టూడియో సౌకర్యాలను ఒకే గొడుకు కిందకు తీసుకొచ్చి 360 డిగ్రీల్లో పూర్తి వినోద వేదికను సృష్టించడమే వేల్స్ మ్యూజిక్ లక్ష్యమన్నారు. సంగీతం, సినిమా మన సంస్కృతి జీవనాడి అని అభిప్రాయపడ్డారు. ప్రపంచ సంగీత పరిశ్రమలో జరుగుతున్న మార్పులతో మనం ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. తమిళ యువత ప్రతిభను ముందుకు తీసుకెళ్లడానికి వేల్స్ మ్యూజిక్ ఇంటర్నేషనల్ ఒక వేదికగా ఉంటుందన్నారు. ఇది ఒక సాధారణ మ్యూజిల్ లేబుల్ కాదని, నవతరం సృష్టించే సంగీత ఉద్యమం అని అన్నారు. పైగా తన పుట్టిన రోజున ఈ కంపెనీని ప్రారంభించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. ఈ మ్యూజిక్ కంపెనీ ప్రారంభోత్సవంలో హీరోలు ధనుష్, అరుణ్ విజయ్, విష్ణు విశాల్, సంగీత దర్శకులు ఏఆర్ రెహ్మాన్, అనిరుధ్ రవిచందర్, దర్శకుడు వెట్రిమారన్, కేఎస్ రవికుమార్, పార్తిబన్, మారి సెల్వరాజ్, ప్రభుదేవ, డి.ఇమ్మాన్ తదితరులు పాల్గొన్నారు.

తిరుప్పూర్‌లో ముమ్మరంగా రెడీమేడ్ దుస్తుల తయారీ

ప్యారీస్, అక్టోబర్ 8 (ఆంధ్రజ్యోతి): బంగ్లాదేశ్ నుంచి వస్త్ర దిగుమతి తగ్గడంతో తిరుప్పూర్ పరిశ్రమల నగరంలో రెడీమేడ్ దుస్తుల తయారీ ఊపందుకుందని, దేశంలోని పలు రాష్ట్రాల నుంచే కాకుండా విదేశాల నుంచి కూడా ఆర్డర్లు పెరుగుతున్నాయని బనియన్ పరిశ్రమల యజమానులు హర్షం వ్యక్తం చేశారు. రెడీమేడ్ దుస్తుల వాణిజ్యంలో భారత్‌తో పోటీపడిన బంగ్లాదేశ్ 2017 నుంచి ఎగుమతి రంగంలో అగ్రస్థానంలో నిలిచింది. ఈ నేపథ్యంలో, జీఎస్టీ అమలులోకి వచ్చాక నిబంధనలు సడలించడంతో క్రమక్రమంగా బంగ్లాదేశ్ వస్త్రాల దిగుమతి పెరిగింది. దేశంలో బ్రాండెడ్ సంస్థలు సైతం బంగ్లాదేశ్ నుండి దిగుమతి చేసుకున్న దుస్తులనే విక్రయించి ఆర్థికంగా లబ్దిపొందాయి. ఈ రకంగా గత ఐదేళ్లలో రూ.500 కోట్లున్న బంగ్లాదేశ్ రెడీమేడ్ దుస్తుల దిగుమతి రూ.5,200 కోట్లకు పెరిగింది. దీనివల్ల స్వదేశీ సంతలో బంగ్లాదేశ్ ఉత్పత్తులపై మోజు పెరిగింది. ఈ నేపథ్యంలో, బంగ్లాదేశ్‌లో ప్రస్తుతం యుద్ధ వాతావరణ నెలకొనడంతో భారత్ వస్తువులను దిగుమతి చేసుకునేందుకు నిబంధనలు కఠినతరం చేశారు. దీంతో కేంద్ర ప్రభుత్వం బంగ్లాదేశ్ ఉత్పత్తుల దిగుమతికి స్టే విధించింది. ఇందువల్ల దక్షిణ భారత బనియన్ ఉత్పత్తిదారులు గత నాలుగు నెలలుగా రెడీమేడ్ దుస్తుల తయారీపై ప్రత్యేక దృష్టిసారించారని సంఘ అధ్యక్షుడు షణ్ముగ సుందరం తెలిపారు. ఇన్నాళ్లు బంగ్లాదేశ్‌కు ఆర్డర్లు ఇచ్చిన ప్రముఖ బ్రాండెడ్ సంస్థలు మళ్లీ తిరుప్పూర్‌కే ఆర్డర్లు ఇచ్చేందుకు ముందుకొస్తున్నాయని, ఇందువల్ల లక్షలాది మందికి ఉపాధి అవకాశం వచ్చిందని ఆయన తెలిపారు.


దుస్తుల తయారీ పనుల్లో కార్మికులు


తొలి కొనుగోలును ప్రారంభిస్తున్న దృశ్యం

కోవైలో రామ్‌రాజ్ 20వ స్టోర్ ప్రారంభం

చెన్నై, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): పరిశ్రమల నగరమైన కోయంబత్తూరులో ప్రసిద్ధిగాంచిన రామ్‌రాజ్ కాటన్ సంస్థ తన 20వ స్టోర్‌ను ఏర్పాటు చేసింది. గాంధీపురంలోని వందడుగుల రోడ్డులో ఏర్పాటైన ఈ షోరూంను విద్యావేత్త డాక్టర్ బీకే కృష్ణరాజ్ వనవరయార్, కేజీ హాస్పిటల్ ఛైర్మన్ డాక్టర్ జి.భక్తవత్సలం బుధవారం లాంఛనంగా ప్రారంభించారు. ఎమరాల్డ్ జ్యువెల్ ఇండస్ట్రీ ఇండియా లిమిటెడ్ సీఎండీ కె.శ్రీనివాసన్, రామ్‌రాజ్ కాటన్ వ్యవస్థాపకుడు, ఛైర్మన్ కేఆర్ నాగరాజన్, మాజీ మంత్రి పొంగులూరు ఎస్.పళనిస్వామి, జేఎండీ ఎస్.అశ్విన్, హీరో ఫ్యాషన్ ఎండీ సుందరమూర్తి తదితరులు ప్రారంభోత్సవంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేఆర్ నాగరాజన్ మాట్లా డుతూ.. కోయంబత్తూరులో తమ 20వ షోరూం ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. ఈ నగరం తమకు ఎల్లప్పుడూ ప్రత్యేకమైనదని, సంవత్సరాలుగా చూపిన మద్దతుకు తాము కృతజ్ఞులై వుంటామన్నారు.


రాస్తారోకోలో విద్యార్థులు

బస్సు సమయం మార్చాలంటూ విద్యార్థుల రాస్తారోకో

చెన్నై, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): బస్సు సమయం మార్చాలని కోరుతూ ప్రభుత్వ బస్సును అడ్డుకున్న విద్యార్థులు, రోడ్డుపై బైఠాయించారు. సేలం జిల్లా గూడమలైలో ఉన్న ప్రభుత్వ మహోన్నత పాఠశాలలో 370 మందికి పైగా విద్యార్థులు చదువుతున్నారు. పాఠశాలకు నల్లమాది, నీలంగరై, 95 పేలూరు, నీరిప్పాడి తదితర గ్రామాల నుంచి విద్యార్థులు ప్రతిరోజు ప్రభుత్వ బస్సులో రాకపోకలు సాగిస్తుంటారు. ఆత్తూర్ నుంచి బస్సు ఉదయం 5.30 గంటలకు బయల్దేరడంతో, ఆ బస్సులో వెళ్లేందుకు విద్యార్థులు 3 గంటలకే లేచి బస్టాండ్‌కు చేరుకోవాల్సి వస్తోంది. అలాగే, నల్లమాది నుంచి సాయంత్రం 5 గంటలకు బస్సు బయల్దేరుతోంది. ప్రస్తుతం పాఠశాలలో 10, 11, 12 తరగతులకు పబ్లిక్ పరీక్షలు కావడంతో, వారికి పాఠశాల ముగిసిన అనంతరం ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. ఈ కారణంగా 5.30 గంటలకు విద్యార్థులు పాఠశాల నుంచి వెలుపలికి వస్తుంటారు. అయితే అప్పటికే బస్సు వెళ్లిపోతుండడంతో ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ కారణంగా, బస్సు సమయాలు మార్చాలంటూ విద్యార్థులు అధికారులను కోరినా ఫలితం లేకపోవడంతో, బుధవారం ఉదయం ఆ బస్సును అడ్డుకుని రాస్తారోకో చేపట్టారు.

ఘనంగా ఏఎం జైన్ కళాశాల స్నాతకోత్సవం

చెన్నై, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఏఎం జైన్ కళాశాల 71వ స్నాతకోత్సవం అట్టహాసంగా జరిగింది. ఈ వేడుకలకు సిటీ యూనియన్ బ్యాంక్ నాన్- ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్ జి.మహాలింగం ముఖ్యఅతిథిగా హాజరై షిఫ్ట్ -1 విద్యార్థులకు పట్టాలను ప్రదానం చేసి స్నాతకోత్సవ సందేశమిచ్చారు. ప్రిన్సిపాల్ డాక్టర్ బి.మహావీర్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్ అనంతకృష్ణన్ తదితరులు పాల్గొన్నారు. ఈ స్నాతకోత్సవంలో సైన్స్, ఆర్ట్స్, కామర్స్ విభాగాలకు చెందిన 648 మంది విద్యార్థులకు యూజీ, పీజీ పట్టాలను ప్రదానం చేశారు.


ఓ విద్యార్థికి పట్టాను ప్రదానం చేస్తున్న సిటీ యూనియన్ బ్యాంక్ నాన్- ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్ జి. మహాలింగం



రాజ్‌భవన్‌లోని భారతియార్ మండపంలో గవర్నర్ ఆర్ఎన్ రవి చేతుల మీదుగా ప్రశంసాపత్రాలు అందుకున్న ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకులు పొందిన వైద్య సంస్థల ప్రతినిధులు

ఎన్నికల్లో అక్రమాలకు బీజేపీకి ఈసీ అండ

● మంత్రి కేఎన్ నెహ్రూ ధ్వజం



అడయార్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) అనే అనైతిక చర్యతో ఎన్నికల్లో అక్రమాలకు పాల్పడేందుకు భారతీయ జనతా పార్టీ ప్రయత్నిస్తోందని, అలాంటి పార్టీకి భారత ఎన్నికల సంఘం అండగా నిలుస్తోందని రాష్ట్ర మంత్రి కేఎన్ నెహ్రూ విమర్శించారు. ఇదే విషయంపై ఆయన బుధవారం పత్రికా ప్రకటన విడుదల చేశారు. తమిళనాడులో ఎస్ఐఆర్ చేపట్టేందుకు ఎట్టిపరిస్థితుల్లో అంగీకరించబోమన్నారు. బిహార్‌లో అమలుచేసిన కుట్రలు కుతంత్రాలను తమిళనాడులో కూడా అమలు చేసేందుకు బీజేపీ నేతలు ప్రయత్నిస్తున్నారన్నారు. క్షేత్రస్థాయి తనిఖీల్లోనే అనేక ఓట్లను తొలగించేందుకు కుట్ర పన్నుతున్నారని ఆరోపించారు. ఈ కుట్రను తమిళనాడు ప్రజలు, రాజకీయ పార్టీలు ఎట్టి పరిస్థితుల్లోనూ అంగీకరించబోవని పేర్కొన్నారు. బిహార్ రాష్ట్రంలో సుమారు 8 కోట్ల మంది ఓటర్లు ఉన్నారని, అయితే ఎస్ఐఆర్ పేరుతో కేంద్ర ఎన్నికల సంఘం లక్షల ఓట్లను తొలగించిందన్నారు. ఈ చర్యను సుప్రీంకోర్టు ఖండించినప్పటికీ ఓటరు జాబితా నుంచి తొలుత 65 లక్షల మంది ఓటర్లను, ఆ తర్వాత మరో 3.7 లక్షల ఓటర్లను తొలగించిందని ఆయన గుర్తు చేశారు. ముస్లింలు, దళితులు, మహిళలను లక్ష్యంగా చేసుకుని ఓట్లను జాబితా నుంచి తొలగించిందన్నారు అయితే, బిహార్ కొత్తగా 21 లక్షల మంది ఓటర్లను జాబితాలో చేర్చినట్టు ఈసీ వెల్లడించిందన్నారు. అయితే, మొదట తొలగించిన 3.7 లక్షల ఓటర్ల పేర్లు కూడా ఆ జాబితాలో ఉన్నాయా? లేవా? అనే అంశంపై నివేదిక సమర్పించాలని ఈసీని సుప్రీంకోర్టు ఆదేశించిందన్నారు. సుప్రీంకోర్టు సంధిస్తున్న ప్రశ్నలతో ఈసీ పారదర్శకత బహిర్గతమవుతుందన్నారు. ఇలాంటి చర్యలు మన రాష్ట్రంలో పునరావృత్తం కానివ్వబోమన్నారు.

టి.నగర్‌లో క్యారెట్‌లేన్ స్టోర్ ప్రారంభం


క్యారెట్‌లేన్ స్టోర్ ప్రారంభోత్సవంలో కయదు లోహర్, సామెన్ భౌమిక్

అడయార్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): స్థానిక టి.నగర్, నార్త్ ఉస్మాన్ రోడ్డులో క్యారెట్‌లేన్ స్టోర్‌ను ప్రముఖ సినీ నటి కయదు లోహర్ బుధవారం ప్రారంభించారు. దేశంలో ప్రముఖ ఓమ్నిచానల్ ఆభరణాల బ్రాండ్‌గా గుర్తింపు పొందిన క్యారెట్‌లేన్ టాటా గ్రూపు సహకారంతో ఈ స్టోర్‌ను ప్రారంభించింది. ఇది తమిళనాడులో 17వ షోరూం కాగా, దేశవ్యాప్తంగా 350 షోరూం కావడం గమనార్హం. అదేవిధంగా క్యారెట్‌లేన్ తన 17వ వార్షికోత్సవాన్ని కూడా ఘనంగా జరుపుకుంది. మొత్తం 1400 చదరపుటడుగుల విస్తీర్ణంలో ఈ స్టోర్‌ను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా క్యారెట్‌లేన్ మేనేజింగ్ డైరెక్టర్ సామెన్ భౌమిక్ విలేకరులతో మాట్లాడుతూ, 'చెన్నై మహానగరంలో ఆభరణాలకు గుండెకాయ వంటి టి.నగర్ నార్త్ ఉస్మాన్ రోడ్డులో తమ షోరూంను ప్రారంభించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. తమ ఆభరణాలను ప్రమోట్ చేసేందుకు ప్రముఖ నటి కయదు లోహర్‌ను బ్రాండ్ అంబాసిడర్‌గా నియమించుకున్నట్టు పేర్కొన్నారు. ఈ షోరూంలో రోజూ ధరించే ఆభరణాలతో పాటు విలువైన, ఆకర్షణీయమైన డిజైన్లతో నగలు అందుబాటులో ఉన్నాయని ఆయన వివరించారు.

12 వరకు రాష్ట్రానికి వర్ష సూచన

అడయార్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో ఈ నెల 12 వరకు భారీ వర్షం కురుస్తుందని చెన్నై ప్రాంతీయ వాతావరణ కేంద్రం తెలిపింది. ఈ విషయంపై బుధవారం పత్రికా ప్రకటన విడుదల చేసింది. నైరుతి బంగాళాఖాతంలో బాహ్య ఉపరితల ద్రోణి ఏర్పడి ఉందని, దీని ప్రభావంతో రాష్ట్రంలోని కొన్ని ప్రాంతాలతో పాటు పుదుచ్చేరి, కారైక్కాల్ ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులు, పిడుగులతో కూడిన వర్షం కురుస్తుందని పేర్కొంది. ముఖ్యంగా నీలగిరి, కోయంబత్తూరు, తేని, దిండిగల్, ఈరోడ్, కృష్ణగిరి, ధర్మపురి, సేలం, నామక్కల్, తిరుపత్తూరు, రాణిపేట, వేలూరు, కాంచీపురం జిల్లాల్లో కొన్ని చోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందనింది. శుక్రవారం కోయంబత్తూరు జిల్లాలోని కొండ ప్రాంతాల్లో, నీలగిరి, తేని, దిండిగల్, మైలాడుదురై, నాగపట్టినం, తిరువారూర్, తంజావూరు, పుదుక్కోట, కడలూరు జిల్లాలతో పాటు కారైక్కాల్‌లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉందని తెలిపింది. 12 న కోయంబత్తూరు, నీలగిరి, తేని, దిండిగల్, విరుదునగర్, మదురై, శివగంగై జిల్లాల్లో కొన్నిచోట్ల భారీ వర్షం కురిసే అవకాశం ఉందని పేర్కొంది. ఈ కారణంగా తమిళనాడు, పుదుచ్చేరి రాష్ట్రాల్లో గరిష్ఠ ఉష్ణోగ్రతలు 2 నుంచి 3 డిగ్రీల మేరకు తగ్గే అవకాశం ఉందని తెలిపింది.

ఎల్ అండ్ టీ వైస్‌ప్రెసిడెంట్‌కు గౌరవ డాక్టరేట్


గౌరవ డాక్టరేట్లతో కుమరసన్, శబరినాథన్

అడయార్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): యూకేలోని కేంబ్రిడ్జ్ స్కూల్ ఆఫ్ డిస్టెన్స్ ఎడ్యుకేషన్‌కు అనుబంధంగా ఆస్ట్రేలియాలోని సెయింట్ మదర్ థెరిసా విశ్వవిద్యాలయం ఇండియన్ మీడియా వర్క్స్ ఎండీ జాన్ అమలన్ సిఫారసు మేరకు ఎల్ అండ్ టీ సీనియర్ వైస్‌ప్రెసిడెంట్ కుమరసన్, గ్రేటర్ చెన్నై ఎస్పై శబరినాథన్‌కు గౌరవ డాక్టరేట్ ప్రదానం చేసింది. ఇటీవల కోయంబత్తూరులో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో యూనివర్శిటీ నిర్వాహకులు ఇద్దరికీ గౌరవ డాక్టరేట్లు అందజేశారు. గ్లోబ్ కార్పొరేట్ మేనేజ్‌మెంట్‌లో అత్యుత్తమ నాయకత్వ ప్రతిభ, పారిశ్రామిక రంగానికి చేసిన సేవలకు గాను కుమరసన్‌కు, పోలీస్ శాఖలో అసాధారణ సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించినందుకు శబరినాథన్‌కు ఈ డాక్టరేట్ అందజేసినట్లు నిర్వాహకులు పేర్కొన్నారు.

సినీ దర్శకుడు గంగై అమరన్‌కు చేదు అనుభవం

● మురుగన్ దర్శనానికి నిరాకరణ




తిరుత్తణి, అక్టోబర్ 8 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ సినీ దర్శకుడు, గాయకుడు గంగై అమరన్‌కు తిరుత్తణి ఆలయంలో చేదు అనుభవం ఎదురైంది. వివరాల్లోకి వెళితే మంగళవారం సాయంత్రం తిరువళ్లూరు జిల్లా తిరుత్తణి మురుగన్ ఆలయ ప్రాంగణంలో విశ్వహిందూ పరిషత్ అధ్యక్షుడు దురైపాండ్యన్ అధ్యక్షతన కొండపై ఉన్న నెమలి మండపంలో ఆయన మురుగన్‌కు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజా అనంతరం దర్శకుడు గంగై అమరన్ తన అనుచరులు మొత్తం ఐదుగురు మురుగన్ దర్శనానికి క్యూలైన్‌లో కాకుండా వీఐపీ దర్శనం గేట్ ద్వారా ఆలయంలోకి ప్రవేశించే ప్రయత్నం చేశారు. ఈ నేపథ్యంలో, ఆలయ నిర్వాహకులు వీఐపీ గేట్ ద్వారా ఆయనను దర్శనానికి నిరాకరించి రూ.100 లేదా ఉచిత క్యూలైన్‌లో వెళ్లమని సూచించారు. దీనితో ఆగ్రహించిన గంగై అమరన్ మురుగన్ దర్శనం చేసుకోకుండానే వెనుదిరిగి వెళ్లిపోయారు.

'పంచ ద్వారక' ఆధ్యాత్మిక రైలు

పెరంబూర్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): శ్రీకృష్ణుడి అవతార జీవితంలో ఐదు ముఖ్యమైన ప్రదేశాలు దర్శించేలా 'పంచ ద్వారక' ఆధ్యాత్మిక రైలు కేరళ రాష్ట్రం ఎర్నాకుళం నుంచి నవంబరు 25వ తేది బయల్దేరనుంది. కోవై పోతనూరు, మదురై, ఈరోడ్, సేలం, చెన్నై మీదుగా గుజరాత్ చేరుకుంటుంది. అక్కడ ద్వారక, ఠాగూర్ ద్వారక, నాథురాక్, బెట్ ద్వారక, కాన్క్రోల ద్వారకలను సందర్శించవచ్చు. ఈ యాత్రలో సర్దార్ వల్లభాయ్ పటేల్ విగ్రహం, శ్రీ రామానుజ సమానత్వం విగ్రహాలను కూడా వీక్షించవచ్చు. అలాగే, నవంబరు 25వ తేది మరో పర్యాటక రైలు ఎర్నాకుళం నుంచి కోవై, ఈరోడ్, సేలం, చెన్నై మీదుగా రాజస్తాన్ రాష్ట్రం వెళ్లనుంది. హైదరాబాద్‌లోని గోల్కొండ కోట, జోథ్‌పూర్‌లోని ఉమైద్ భవన్ మ్యూజియం, జైసల్మేర్ జైన దేవాలయం, సామ్ శాండ్ డ్యూన్స్, జగదీష్ ఆలయం తదితరాలు సందర్శించవచ్చు. 13 రోజుల ఈ ఆధ్యాత్మిక, విహార యాత్రలకు కనిష్ఠంగా రూ.41,150, గరిష్ఠంగా రూ.63,000 ఛార్జీగా నిర్ణయించారు. వివరాలకు నెం.7305858585లో సంప్రదించవచ్చని దక్షిణ రైల్వే పేర్కొంది.


నారా రోహిత్


అమరెడ్డి, పవిత్ర


కోనా వెంకట్

శ్రీవారి సేవలో ప్రముఖులు

తిరుమల శ్రీవారిని బుధవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వీరిలో సినీహీరో నారా రోహిత్, నటులు అమరెడ్డి, పవిత్ర, మాటల రచయిత కోనా వెంకట్, సీనియర్ ఐఏఎస్ అధికారి పంకజ్ కుమార్ బన్సల్, ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి ఉన్నారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

సత్యాత్మతీర్థ స్వామిజీకి తిరుమలలో పెద్దమర్యాద



తిరుమల, అక్టోబరు8 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాదిమఠాధిపతి సత్యాత్మతీర్థ స్వామిజీ బుధవారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. ఉదయం నైవేద్య విరామ సమయంలో అఖిలాండం వద్ద స్వామిజీకి టీటీడీ ఈవో అనిల్‌కుమార్ సింఘాల్, అర్చక బృందం ఇస్తికాఫల్(పెద్ద మర్యాద) స్వాగతం పలికారు. ఆలయం నుంచి పల్లకీలో తీసుకెళ్లిన శఠగోపంతో ఆశీర్వాదం అందించారు. అనంతరం ఆయన తన శిష్యబృందంతో కలిసి మంగళవాయిద్యాల నడుమ ఆలయంలోకి వెళ్లి శ్రీవారిని దర్శించుకున్నారు.


సర్వదర్శనానికి 14 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 14 గంటల సమయం పడుతోంది. బుధవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 31 కంపార్టుమెంట్లు, నారాయణగిరిలోని 9 షెడ్లు సర్వదర్శన భక్తులతో నిండిపోయాయి. క్యూలైన్ శిలాతోరణం సర్కిల్ వరకు వ్యాపించింది. వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 6 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

సోమవారం హుండీ ఆదాయం: రూ.4.74 కోట్లు

మంగళవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 71,634

తలనీలాలు సమర్పించినవారు: 24,980



వెంకటేశ్వరస్వామి ఆలయంపై పిడుగుపాటు


దెబ్బతిన్న ఆలయ గోపుర శిఖర భాగం - పగిలి కిందపడిన దేవతామూర్తుల భాగాలు

సూళ్లూరుపేట,అక్టోబరు8(ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట మండలంలోని మంగళంపాడు వెంకటేశ్వరస్వామి ఆలయ గోపురంపై బుధవారం సాయంత్రం పిడుగు పడింది. 4 గంటల సమయంలో భారీ వర్షంతో పాటు పెద్ద శబ్దంతో పిడుగు పడడంతో ఆలయ గోపురంపై ఉన్న శిలలు దెబ్బతిన్నాయి. అలాగే గోపురంపై ఉన్న దేవతామూర్తుల భాగాలు పగిలి కింద పడ్డాయి. అదే సమయంలో ఆలయ వరండాలో ఉన్న కొందరు గ్రామస్తులు భయంతో పరుగులు తీశారు. కాసేపటికి తేరుకున్న గ్రామస్తులు పిడుగు పడిన ప్రదేశాన్ని పరిశీలించారు.

'తుడా టవర్స్'సేల్‌పై కమిటీ

- రెసిడెన్షియల్ ఫ్లాట్ల ధరలు సవరణకు కసరత్తు
- ఒక్కోఫ్లాట్‌పై రూ.5లక్షల నుంచి రూ.10 లక్షల వరకు తగ్గే అవకాశం
- మంత్రి గ్రీన్ సిగ్నల్

తిరుపతి, ఆంధ్రజ్యోతి

తిరుపతి పట్టణాభివృద్ధి సంస్థ (తుడా) అన్నమయ్య సర్కిల్లో నిర్మిస్తున్న ఐకానిక్ టవర్స్‌లో రెసిడెన్షియల్ ఫ్లాట్ల ధరలు తగ్గనున్నాయి. అధిక ధరల వలన విక్రయాలు మందకొడిగా సాగుతుండడంతో కమిటీని ఏర్పాటుచేసేందుకు తుడా సిద్ధమైంది. 206 రెసిడెన్షియల్ ఫ్లాట్లలో ఇప్పటికి 21మాత్రమే అమ్ముడయ్యాయి. చదరపు అడుగు ధర ఎక్కువగా ఉండడం వల్లే కొనుగోలుదారులు ముందుకురావడం లేదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఇటీవల పురపాలక శాఖ మంత్రి నారాయణ తుడా కార్యాలయంలో జరిగిన సమీక్షలో ఐకానిక్ టవర్స్ గురించి ఆరాతీశారు. స్థానికంగా ఉన్న అపార్ట్‌మెంట్ల ధరలను పరిశీలిస్తే, తుడా టవర్స్‌లోని రెసిడెన్షియల్ ఫ్లాట్ల చదరపు అడుగు ధర ఎక్కువగా ఉందన్న అభిప్రాయానికి వచ్చినట్టు తెలిసింది. దీనికోసం ఓ కమిటీని ఏర్పాటుచేసి ధరలను సవరించాలని తుడా వీసీ శుభం బన్సల్ మంత్రిని కోరారు. మంత్రి కూడా గ్రీన్ సిగ్నల్ ఇస్తూ త్వరలోనే ఆ ప్రక్రియ పూర్తిచేయాలని సూచించారు. ప్రస్తుతం రెసిడెన్షియల్ ధర చదరపు అడుగు రూ.5,900 గా ఉంది. దీనిని రూ.5,500లుగా సవరించే అవకాశం కనిపిస్తోంది. అంటే ఒక్కో ఫ్లాట్ ధర రూ.5లక్షల నుంచి రూ.10లక్షలు తగ్గించే అవకాశం కనిపిస్తోంది. అదేవిధంగా కమర్షియల్ స్పేస్ చదరపు అడుగు రూ.12వేలు ఉంది. 31 వాణిజ్య సముదాయాల్లో 11 సేల్ అయిపోయాయి. దీనికి మంచి డిమాండు ఉండడంతో వీటి ధరలో ఎలాంటి మార్పు ఉండకపోవచ్చు.



టవర్స్ తాజా పరిస్థితి

తుడా టవర్స్ 3.6 ఎకరాల్లో రూ.345 కోట్లతో నిర్మాణం జరుగుతోంది. ప్రస్తుతం రూ.122 కోట్ల విలువైన పనులు పూర్తయ్యాయి. 14 అంతస్తుల భవనంలో 12వ ఫ్లోర్ స్లాబ్ పూర్తయింది. 6వ ఫ్లోర్ వరకు టైల్స్ పనులు జరిగాయి. ఈ ప్రాజెక్టు ద్వారా నిర్మాణ వ్యయం కాకుండా తుడా రూ.150కోట్లు ఆదాయం లక్ష్యంగా పెట్టుకుంది. ఇప్పటికే రూ.91కోట్లు విక్రయాల ద్వారా తుడా ఖాతాలోకి చేరాయి. మరో రూ.66 కోట్లు రావాల్సి ఉంది.

జూన్‌లో నిర్మాణం పూర్తి

గ్రౌండ్, ఒకటవ అంతస్థులో 27 విశాలమైన గదులతో వాణిజ్య సముదాయాలు, రెండు, మూడు, నాలుగు అంతస్థుల్లో ఆఫీసుల వినియోగానికి, మిగిలిన వాటిలో 206 రెసిడెన్షియల్ ఫ్లాట్లను నిర్మిస్తున్నారు. కమర్షియల్, రెసిడెన్షియల్‌కు వేర్వేరుగా యాంపుల్ పార్కింగ్, లిఫ్టులు, వేర్వేరుగా మార్గాలు ఏర్పాటు చేస్తున్నారు. జూన్‌లోపు అందుబాటులోకి వస్తుందని తుడా కార్యదర్శి డాక్టర్ శ్రీకాంత్ చెప్పారు.

డ్రైవర్ ఆత్మహత్య

- ఎస్ఐ బెదిరింపులే కారణమని తల్లి ఆరోపణ


అనిల్ (ఫైల్‌ఫొటో)

కోట, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): కోట మండలం చిట్టేడు గ్రామానికి చెందిన నన్నిమేల అనిల్ (36) గడ్డి మందుతాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఓ రొయ్యల పరిశ్రమకు చెందిన కార్మికులను తీసుకెళ్లే బస్సు డ్రైవర్‌గా పనిచేస్తున్న అనిల్ పెద్దమొత్తంలో అప్పులు చేశాడు. రుణదాతల ఒత్తిళ్లు భరించలేక బుధవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో గడ్డి మందు తాగాడు. కుటుంబసభ్యులు గమనించి కోట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో గూడూరులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. ఇదిలా ఉండగా ఒక బాకీదారుడికి అప్పు చెల్లించాలని ఎస్ఐ పవన్‌కుమార్ బెదిరించడంతోనే తమ బిడ్డ ఆత్మహత్య చేసుకున్నాడని అనిల్ తల్లి ఉమామహేశ్వరి గూడూరు డీఎస్పీ గీతాకుమారికి ఫిర్యాదు చేశారు. ఎస్ఐపై వచ్చిన ఆరోపణలపై దర్యాప్తు చేస్తున్నామని వాకాడు సీఐ హుస్సేన్ బాషా తెలిపారు.

'మార్పు'తోనే మనుగడ

- సహకార రంగం బలోపేతమే లక్ష్యం
- తిరుపతి సదస్సులో కేంద్ర సహకార మంత్రిత్వశాఖ కార్యదర్శి ఆశిష్‌కుమార్ భూటాని


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఆశిష్‌కుమార్ భూటాని

తిరుపతి(కలెక్టరేట్), అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): 'ఏ రంగమైనా మార్పుతోనే మనుగడ సాధిస్తుంది. గ్లోబలైజేషన్, సాంకేతిక పరిణామాలకు అనుగుణంగా మలచుకోలేక అనేక సహకార సంస్థలు ప్రాధాన్యం కోల్పోయాయి. పాత విధానాలు కొనసాగిస్తూ, సభ్యులను ఆకర్షించలేకపోయాయి. దీనికి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలే నిదర్శనం. ఏపీలో మాత్రం పీఏసీఎస్‌లు ఇపుడు పెట్రోల్ బంకు వంటి కొత్త రంగాల్లో అడుగుపెట్టడం సంతోషకరం' అని కేంద్ర సహకార మంత్రిత్వశాఖ కార్యదర్శి ఆశిష్‌కుమార్ భూటాని అన్నారు. 'సహకార రంగం అభివృద్ధి- డిజిటలైజేషన్, గ్రైన్ స్టోరేజ్, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు విస్తరణ, కోఆపరేటివ్ బ్యాంకింగ్ బలపరిచే దిశగా' అంశంపై రెండు రోజుల పాటు జరిగే జాతీయ సదస్సు బుధవారం తిరుపతి తాజ్‌హోటల్‌లో ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్రాల్లో సహకార రంగాన్ని బలోపేతం చేయడం, ఆర్థిక వృద్ధిని పెంపొందించడంపై ప్రత్యేక దృష్టిపెడుతున్నట్లు చెప్పారు. సహకార బ్యాంకింగ్ రంగంలో రాష్ట్రాల నుంచి మరింత లోతైన ఆలోచన రావాల్సిన అవసరం ఉందన్నారు. కొత్త రంగాల్లో తాము చేస్తున్న ప్రయత్నాలపైనా చర్చ జరుగుతోందన్నారు. సహకార ట్యాక్సీలు, బీమా రంగంలో రాష్ట్రాల భాగస్వామ్యంపైనా చర్చిస్తామన్నారు. రాష్ట్రాలలో సహకార విద్యావ్యవస్థను ఎలా అనుసంధానించాలో, పాఠశాలలు ఎలా స్థాపించాలనే దానిపై ప్రత్యేక దృష్టి పెడుతున్నట్లు వివరించారు. ఈ సదస్సులో మూడు నెలల కార్యాచరణపై ముఖ్యమైన అంశాలు ఉంటాయన్నారు.



ఇతర రంగాల్లోకి విస్తరిస్తాం

సహకార సంస్థలు కేవలం రైతుల రుణావసరాలను తీర్చడమే కాకుండా ఆరోగ్యసేవలు(జన ఔషధి కేంద్రాలు), ఆహార ప్రాసెసింగ్, డ్రోన్ ఆధారిత ఎరువుల పంపిణీతో పాటు ఇతర రంగాల్లోకి విస్తరిస్తాయని రాష్ట్ర సహకార కమిషనర్ ఎం.బాబు తెలిపారు. ఇలాంటి సదస్సులు సహకార రంగాన్ని మరింత బలోపేతం చేస్తాయన్నారు. సహకార సంఘం బలోపేతం, ఆర్థికవృద్ధిపై కేంద్ర సహకార మంత్రిత్వ శాఖ అదనపు కార్యదర్శులు పంకజ్‌కుమార్‌బన్సాల్, రవీంద్రకుమార్ అగర్వాల్, సంయుక్త కార్యదర్శులు ఆనందకుమార ఝూ, రమణకుమార్ ప్రసంగించారు. వివిధ సహకారశాఖలు స్టాళ్లను ప్రదర్శించాయి. ఈ ఎగ్జిబిషన్‌లో సామాన్యులకు అందజేస్తున్న హార్డ్‌వేర్ కిట్, ఈఆర్పీ సాఫ్ట్‌వేర్ ప్రత్యక్ష డెమోను నిర్వహిస్తున్నారు. సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాలు జరిగాయి. ఆయా కార్యక్రమాల్లో కలెక్టర్ వెంకటేశ్వర్, జేసీ శుభం బన్సల్, అడిషనల్ రిజిస్ట్రార్లు ఆనందబాబు, గౌరీశంకర్, జాయింట్ రిజిస్ట్రార్లు శ్రీలక్ష్మి, చిత్తూరు, తిరుపతి డీసీవోలు లక్ష్మి, నాగవర్ధన, వివిధ రాష్ట్రాల సహకార సంఘాల కార్యదర్శులు, రిజిస్ట్రార్లు, నాబార్డు, ఎంపీడీసీ, సహకార సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

దేశ భవితను తీర్చిదిద్దడంలో ప్రభుత్వ వ్యవస్థ కీలకం

- డాక్టర్ జయప్రకాష్ నారాయణ వెల్లడి

ఏర్పేడు, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): దేశ భవిష్యత్తును తీర్చిదిద్దడంలో ప్రభుత్వ వ్యవస్థ ఎంతో అవసరమని లోక్‌సత్తా వ్యవస్థాపకుడు, ప్రజా విధాన నిపుణుడు డాక్టర్ జయప్రకాష్ నారాయణ సూచించారు. ఏర్పేడు వద్దనున్న తిరుపతి ఐఐటీలో 'ఇండియా: ది రోడ్ అహెడ్' అంశంపై బుధవారం ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. దేశ భవిష్యత్తును తీర్చిదిద్దడంలో సమర్థ పాలన ప్రాధాన్యాన్ని వివరించారు. శాంతి, చట్టపరమైన వ్యవస్థ, విద్య, ఆరోగ్య సంరక్షణ వంటి మౌలిక వసతులు, సామాజిక అవసరాల గురించి విశదీకరించారు. భారత ప్రజాస్వామ్య ఆర్థిక అభివృద్ధిపై సంస్కరణలు చూపిన ప్రభావాన్ని వివరించారు. సమగ్ర సుస్థిర వృద్ధి ద్వారానే సమాజంలోని అసమానతలు తొలగించవచ్చని చెప్పారు. తిరుపతి ఐఐటీ డైరెక్టర్ కేఎస్ సత్యనారాయణ మాట్లాడుతూ తిరుపతి ఐఐటీ సాధించిన ప్రగతి, చేపట్టిన చర్యలు, ఇప్పటి వరకు ఐఐటీ అందుకున్న అవార్డుల గురించి తెలిపారు. లెక్చర్ సిరీస్ అనంతరం విద్యార్థులు, అధ్యాపకులు, ఐఐటీ సిబ్బంది డాక్టర్ జయప్రకాష్ నారాయణతో 'పాలన ప్రజా విధానాల సవాళ్లు, యువత పాత్ర' వంటి అంశాలపై ముఖాముఖిగా మాట్లాడారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.


ఐఐటీ విద్యార్థులు, అధ్యాపకులు, సిబ్బందితో జయప్రకాష్ నారాయణ

పశువైద్య రంగంలో 'బేసిక్ సైన్స్' పరిశోధనలు అవసరం

వెటర్నరీ వర్సిటీ జాతీయ సదస్సులో డాక్టర్ తిలగర్

తిరుపతిరూరల్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): పశువైద్య రంగంలో బేసిక్ సైన్స్‌తో సంబంధమైన పరిశోధనల రూపకల్పన ఎంతో అవసరమని తమిళనాడు పశువైద్య వర్సిటీ మాజీ వీసీ ప్రొఫెసర్ డాక్టర్ ఎస్.తిలగర్ పేర్కొన్నారు. ఎస్వీవెటర్నరీ కళాశాలలో పశువైద్య చికిత్స, బోధన సముదాయ(వీసీసీ)విభాగ ఆధ్వర్యంలో 'నేషనల్ క్లినికల్ కేస్ కాన్ఫరెన్స్ ఫర్ వెటర్నరీ స్టూడెంట్స్' అంశంపై బుధవారం నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడారు. నైపుణ్యాలతోపాటు పశుచికిత్స, శస్త్రచికిత్సలకు సంబంధించిన ఆధునిక పశువిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలని సూచించారు. పశువ్యాధులు, వైద్యంలో స్పెషలైజేషన్లు చాలా అవసరమని, ఈదిశగా పీజీ, పీహెచ్‌డీ విద్యార్థులు ప్రత్యేక దృష్టిసారించాలన్నారు. శస్త్రచికిత్స, డయాగ్నసిస్, వ్యాధినిర్ధారణ విభాగాల ప్రాముఖ్యతని ఇండియన్ సొసైటీ ఫర్ అడ్వాన్స్‌మెంట్ ఆఫ్ కెనైన్ ప్రాక్టీస్ అధ్యక్షుడు ప్రొఫెసర్ ప్రతాబన్ విశదీకరించారు. పశువైద్య రంగంలో కృత్రిమమేథ ఎంతో కీలకంగా మారిందని వర్సిటీ వీసీ ప్రొఫెసర్ జేవీ రమణ పేర్కొన్నారు. వీసీసీ ఆధ్వర్యంలో ఆధునిక పద్ధతుల్లో పశువైద్యసేవలు అందిస్తున్నామన్నారు. అప్తమాలజీ సేవలను పశువైద్యచికిత్స బోధనావిభాగంలో ఆధునిక పద్ధతుల్లో సమకూర్చాలని డీన్ ప్రొఫెసర్ కె.వీరబ్రహ్మయ్య వీసీని కోరారు. ఆయా అంశాలపై విద్యార్థులు అధ్యయనం చేయాలని అసోసియేట్ డీన్ ప్రొఫెసర్ డాక్టర్ జగపతిరామయ్య సూచించారు. పశువ్యాధులను ప్రారంభదశలో నిర్ధారించడం ద్వారా మెరుగైన వైద్యసేవలు అందించవచ్చని సదస్సు ఆర్గనైజింగ్ సెక్రటరీ ప్రొఫెసర్ డాక్టర్ వి.వైకుంఠరావు అన్నారు. ఈ సదస్సుకు 14 రాష్ట్రాల నుంచి 25 వెటర్నరీ కళాశాలలకు చెందిన 250మంది విద్యార్థులు హాజరయ్యారు. పలువురు విద్యార్థులు పేపర్ ప్రజంటేషన్ చేశారు. ప్రొఫెసర్లు ఎం.రఘునాథ్, ఎస్.ధనలక్ష్మి, ఎస్.భారతి, డాక్టర్ నస్రీన్ తదితరులు పాల్గొన్నారు.


జాతీయ సదస్సు బుక్‌లెట్‌ని ఆవిష్కరిస్తున్న డాక్టర్ తిలగర్, డాక్టర్ జేవీరమణ, ప్రతాబన్ తదితరులు

బ్లైండ్ స్కేటర్‌కు ఆర్థికసాయం


హర్షవర్ధన్‌కు ఆర్థికసాయం అందిస్తున్న దాతలు

[ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్]

తిరుపతి (క్రీడలు), అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): తిరుపతికి చెందిన బ్లైండ్ స్కేటర్ హర్షవర్ధన్‌కు రూ.25 వేల సాయం అందింది. కళ్లు కనిపించకున్నా ఆ చిన్నారి స్కేటింగ్‌లో రాణిస్తున్న విషయమై సోమవారం ఆంధ్రజ్యోతిలో 'చూపులేకున్నా తగ్గేదే లే' శీర్షికన ప్రత్యేక కథనం ప్రచురితమైంది. దీనిపై స్పందించిన సూళ్లూరుపేటకు చెందిన ఆచార్య భరద్వాజ సేవా సంస్థ ప్రతినిధులు బుధవారం హర్షవర్ధన్ ఇంటికెళ్లి తల్లి రాజకుమారి, అన్న మునిచరణ్, కోచ్ ప్రతాప్ సమక్షంలో రూ.25వేల నగదు అందించారు. కోచ్ ప్రతాప్‌ను సన్మానించారు. ప్రపంచ రికార్డును కైవసం చేసుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సేవాసంస్థ ప్రతినిధులు ఎం.చంద్రబాబు, ఎ.అశోక్‌కుమార్, వి.రత్నబాబు, ఎ.భాస్కరరావు, ఎం.శ్రీనివాసులు, వి.సాయినాథ్ పాల్గొన్నారు.

ముక్కంటి హుండీ ఆదాయం రూ.2.18 కోట్లు



శ్రీకాళహస్తి, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయ హుండీ ఆదాయం రూ.2,18,65,233 సమకూరినట్లు ఈవో బాపిరెడ్డి తెలిపారు. బుధవారం ఆలయం ఆవరణలోని కొట్టు మండపంలో హుండీ లెక్కింపు చేపట్టారు. ప్రధాన హుండీలతోపాటు పరివార దేవతల వద్ద ఉన్న హుండీల నుంచి 134 గ్రాముల బంగారం, 698.500 కిలోల వెండి, 151 విదేశీ కరెన్సీ 151 వచ్చింది. ఆగస్టు 30వ తేదీ నుంచి వచ్చిన కానుకలు లెక్కించగా ఈ ఆదాయం సమకూరింది. కార్యక్రమంలో ఆలయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించకుంటే సమ్మె తప్పదు

- 13న ఛలో విజయవాడ
- డిస్కం కార్పొరేట్ కార్యాలయం వద్ద ధర్నా



తిరుపతి(ఆటోనగర్), అక్టోబరు8 (ఆంధ్రజ్యోతి): 'సదరన్ డిస్కంలో పెండింగ్ సమస్యలు, కాంట్రాక్టు కార్మికులు,గ్రేడ్-2 జేఎల్ఎంలను రెగ్యులర్ చేయాలని జేఏసీ అధ్వర్యంలో దశలవారీ ఆందోళనలు చేస్తున్నాం. అయినా యాజమాన్యం, ప్రభుత్వం స్పందించలేదు. కమిటీలతో కాలయాపన తప్ప ఫలితం ఉండదు. 13న చలో విజయవాడ కార్యక్రమాన్ని నిర్వహిస్తాం. అప్పటికీ సమస్యలు పరిష్కారం కాకుంటే 15వ తేది నుంచి నిరవధిక సమ్మె తప్పదు' అని పవర్ జేఏసీ నాయకులు హెచ్చరించారు. తిరుపతి సదరన్ డిస్కం కార్యాలయం ఎదుట బుధవారం జేఏసీ అధ్వర్యంలో మహా ధర్నా జరిగింది. జేఏసీ నాయకులు వి.దేవేంద్ర రెడ్డి, ఆర్.మురళీధర్, నాగరాజు, ఎల్.చలపతి, నాగార్జున, కృష్ణయ్య, బాలశౌరి, జయరామ్ మాట్లాడుతూ 26 ఏళ్లుగా పనిచేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వడం లేదన్నారు. ఉద్యోగులకు 4 డీఏలు చెల్లించలేదన్నారు. ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. ఈపీఎఫ్‌ను రద్దు చేసి జీపీఎఫ్‌ను అమలు చేయాలన్నారు. గ్రేడ్-2 జేఎల్ఎంలను రెగ్యులర్ చేసి, వారి సమస్యలు పరిష్కరించాలన్నారు. యాజమాన్యం జేఏసీ నేతలతో చర్చించకుండా, బలంలేని టీఎన్‌టీయూసీ నాయకులను ఆహ్వానించడం ఏమిటని ప్రశ్నించారు. కాంట్రాక్టు కార్మికులతో రెగ్యులర్ విధులు చేయిస్తూ స్టైఫండ్ ఎన్నేళ్లు ఇస్తారని ప్రశ్నించారు. ఈ ధర్నాలో నాయకులు రామలింగారెడ్డి, సంజీవరావు, తిరుపాలు, జయమణి, సతీష్, పృథ్వీరాజ్, అంజనేయులు, వి.గోపి, జి.ఏలుమలై, సుధాకర్, శంకర్, రాజేంద్రప్రసాద్ ప్రసంగించారు. ఈ ఆందోళనలో ఉమ్మడి ఏడు జిల్లాల నుంచి విద్యుత్ ఉద్యోగులు, అవుట్ సోర్సింగ్, కాంట్రాక్టు కార్మికులు పాల్గొన్నారు.


ధర్నాలో పాల్గొన్న కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ సంఘం నాయకులు

రోడ్డు ప్రమాదంలో ఇద్దరి దుర్మరణం

- మృతులది పళ్లిపట్టు సమీపం

పుత్తూరు అర్బన్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): పుత్తూరు జాతీయ రహదారిలో బుధవారం మధ్యాహ్నం 3.20 గంటలకు జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు దుర్మరణం చెందారు. తిరుమల శ్రీవారిని దర్శించుకుని ద్విచక్ర వాహనంలో ఇంటికి వెళుతుండగా.. వెనకనుంచి గుర్తు తెలియని వాహనం ఢీకొన్నట్లు ప్రత్యక్ష సాక్షులు చెబుతున్నారు. ఈ ఘటనలో అక్కడికక్కడే వీరిద్దరూ మృతిచెందారు. మృతులు.. తిరవళ్లూరు జిల్లా పళ్లిపట్టు తాలూకా పొతట్టూరుపట్టి గ్రామానికి చెందిన బి.వి.సుబ్రమణ్యం(53), మూర్తి గురునాథం (60)గా పోలీసులు గుర్తించారు. ప్రమాదానికి కారణమైన వాహనం కోసం పోలీసులు గాలిస్తున్నారు. మృతుల కుటుంబాలకు సమాచారం ఇచ్చిన ఎస్ఐ ఓబయ్య కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాలను పుత్తూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.



రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన బి.వి.సుబ్రమణ్యం, మూర్తి గురునాథం